ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 39.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY 5
అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 11 ఏప్రిల్ 2025


మద్యం డిపోను ప్రారంభిస్తున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యేలు, అధికారులు

రాష్ట్రంలో ఢిల్లీకి మించిన

లిక్కర్ స్కాం

నాసిరకం మద్యంతో దోచుకున్నారు

- దీని వెనుక ఎవరున్నా వదిలిపెట్టం
- నూతన విధానంతో ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- అనంత, పాలసముద్రం వద్ద గోడౌన్లు ప్రారంభం

అనంతపురం రూరల్/గోరంట్ల ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఢిల్లీకి మించిన లిక్కర్ స్కాం రాష్ట్రంలో వైసీపీ పాలనలో జరిగిందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. దీని వెనుక ఎంతటి వారున్నా వదిలిపెట్టేది లేదని అన్నారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని సోములదొడ్డి వద్ద రూ.11.10 కోట్లతో నిర్మించిన ఐఎంఎఫ్ఎల్ డిపో గోడౌన్‌ను, శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద మద్యం డిపోను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసిందని అన్నారు. సెబ్‌ను 70 శాతం ఎక్సైజ్ సిబ్బందితో ఏర్పాటు చేసి, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను లేకుండా చేశారని అన్నారు. ప్రముఖ బ్రాండ్లను తప్పించి, వైసీపీ వారి బ్రాండ్లను కొత్త పేర్లతో విక్రయించారని అన్నారు. జె బ్రాండ్లతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాడాక సెబ్‌ను రద్దుచేసి, ఎక్సైజ్ శాఖను ఒకటిగా చేశామని అన్నారు. సీఎంతో మాట్లాడి, ఎక్సైజ్ శాఖలో ఖాళీలను భర్తీ చేస్తామని అన్నారు. రాష్ట్రంలో 29 మద్యం డిపోలు ఉండగా, వైసీపీ ప్రభుత్వం 10 మద్యం డిపోల ఆదాయాన్ని తాకట్టుపెట్టి రూ.23 కోట్ల రుణం తీసుకుందని అన్నారు. సిట్‌ను ఏర్పాటు చేసి.. గత ప్రభుత్వంలో మద్యం కొనుగోళ్లలో జరిగిన అక్రమాలను వెలికి తీస్తున్నామని తెలిపారు. కొత్త మద్యం పాలసీతో ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం

(మిగతా 7లో...)

ఎప్పుడిస్తారో..!

కేంద్రాల నిర్వహణకు ఒక్కో విద్యార్థికి రూ.10..

టెన్త్ పరీక్షలు, స్పాట్‌కు అప్పులే శరణ్యం

- ఏమాత్రం సరిపోవడంటున్న టీచర్లు
- స్పాట్ ముగిసినా నిధులు విడుదల చేయని విద్యాశాఖ


పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

అనంతపురం విద్య, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ముగిశాయి. మూల్యాంకనం కూడా పూర్తయింది. పరీక్షలు, స్పాట్ డ్యూటీలో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి రెమ్యూనరేషన్లు లేవు. అలవెలన్సులు అసలే అందలేదు. పరీక్ష నిర్వహణకు అవసరమైన రూ.10 (ఒక్కో విద్యార్థికి) అందించే కంటింజెన్సీ చార్జీలు ఇవ్వలేదు. గతంలో పరీక్షల ముందునే ఇచ్చే విద్యాశాఖ ఇప్పుడు పరీక్షలు, స్పాట్ ముగిసినా.. టెన్త్ బడ్జెట్ విడుదల చేయలేదు. గతంలో ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు కోటికిపైగా అందించేవారు. గతంలో రూ.80లక్షలకుపైగానే బడ్జెట్ విడుదల చేసేవారు. ఈ ఏడాది రూ.70 లక్షల వరకూ విడుదల చేస్తామని చెప్పినట్లు తెలుస్తోంది. చెప్పిన డబ్బులో కూడా నేటికీ చిల్లిగవ్వ ఇవ్వకపోవడంతో విధుల్లో పాల్గొన్న వేలాది మంది టీచర్లు, అధికారులు రెమ్యూనరేషన్లు, అలవెన్సులు అందలేదు. దీంతో వెంటనే బడ్జెట్ విడుదల చేయాలని ఉపాధ్యాయులు.. ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఖర్చు మోపెడు.. ఇచ్చేది రూ.10

పదో తరగతి-2025 పరీక్షలు గతనెల 17 నుంచి ఈనెల 1వతేదీ వరకూ నిర్వహించారు. జిల్లాలో రెగ్యులర్ పరీక్షలు 135 కేంద్రాల్లో నిర్వహించనుండగా రెగ్యులర్ విద్యార్థులు 32,803 మంది, ఓపెన్ నుంచి 1,114 మంది విద్యార్థులు పరీక్షలకు కేటాయించారు. మొత్తంగా 33,917 మంది విద్యార్థులు పరీక్షలకు కేటాయిస్తే... పరీక్షల నిర్వహణ కోసం కంటిజెన్సీ చార్జీల కింద ఒక్కో విద్యార్థికి రూ.10 చొప్పున విద్యాశాఖ అందించాలి. ఆ నిధులతోనే పరీక్షల నిర్వహణకు సీల్, దారం, కట్టర్, ఇతర మెటీరియల్ కొనడంతోపాటు, తాగునీరు, దానిని అందించే వాటర్ బాయ్‌కు కూలీ, ఇతర అంశాలకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒక విద్యార్థికి రూ.10 ఇస్తే.. ఒక కేంద్రం 240 మంది ఉంటే ఆ సెంటర్‌కు రూ.2400, ఏ, బీ పేరుతో రెండు సెంటర్లు ఉంటే రూ.4,800 చెల్లిస్తారు. ప్రస్తుతం పెరిగిన ఖర్చుల నేపథ్యంలో విద్యాశాఖ ఇచ్చే కంటింజెన్సీ చార్జీలు ఏమాత్రం చాలడం లేదంటున్నారు. సీఎస్‌లకు అదనంగా రూ.2000 వరకూ భారం పడుతోందని చీఫ్ సూపరింటెండెంట్లు వాపోతున్నారు. పైగా ఇప్పటివరకూ ఇవ్వాల్సిన డబ్బు కూడా ఇవ్వడం లేదనీ, చేతి నుంచి ఖర్చు చేశామని చెబుతున్నారు. 135 కేంద్రాలకు 270 మందిని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, మరో 1836 మంది ఇన్విజిలేటర్లతోపాటు భారీగా సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఏడీఓలను నియమించారు. పరీక్షల సిబ్బంది రమారమి 2,200 మంది విధుల్లో ఉన్నారు. వీరిలో జిల్లా అబ్జర్వర్‌కు రూ.300, సీఎస్‌కు రూ.66, డీఓ, ఏడీఓలకు రూ.33, క్లర్కులకు రూ.33, అటెండర్లకు రూ.20, వాటర్‌మ్యాన్‌కు రూ.17, సిట్టింగ్ స్క్వాడ్‌కు రూ.66, మెడికల్ స్టాఫ్(ఏఎన్ఎం)కు రూ.33 రోజుకు రెమ్యూనరేషన్ చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకూ ఎవరికీ ఆ డబ్బు ఇవ్వలేదు. కారణం బడ్జెట్ విడుదల కాకపోవడమే.


స్పాట్‌లో పేపర్లు దిద్దుతున్న టీచర్లు

స్పాట్ ముగిసినా.. అందని అలవెన్స్..

పదో తరగతి పరీక్షల మూల్యాంకనం ఈనెల 3వ తేదీ ప్రారంభించారు. 9వ తేదీకి పూర్తి చేశారు. స్పాట్ విధుల్లో క్యాంప్ ఆఫీసర్లు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. 821 నుంచి 900 మంది వరకూ స్పాట్ విధుల్లో భాగస్వాములయ్యారు. వారికి రోజుకు రెమ్యూనరేషన్ క్యాంప్ ఆఫీసర్‌కు రూ.578, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌కు రూ.495, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌కు రూ.429, చీఫ్ ఎగ్జామినర్‌కు రూ.396, స్పెషల్ అసిస్టెంట్లకు రూ.300, క్లర్కులకు రూ.132, ఆఫీస్ సబార్డినేట్స్‌కు రూ.83, చీఫ్ కోడింగ్ ఆఫీసర్లకు రూ.330, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లకు రూ.297 చొప్పున చెల్లిస్తారు. ఒక్కో పేపర్ వాల్యూయేషన్‌కు రూ.10 చొప్పున ఎగ్జామినర్లకు అందిస్తారు. డీఏ కింద రూ.400తోపాటు ట్రావెలింగ్ అలవెన్సులు అందిస్తారు. ఇంత వరకూ చెల్లించలేదు.

పెంచాల్సింది పోయి.. తగ్గిస్తున్నారు..!

పదో తరగతి పరీక్షలు, స్పాట్‌కు విడుదల చేసే బడ్జెట్ ఏటా తగ్గిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అన్ని రకాల ధరలూ, వేతనాలు పెరుగుతున్నాయి. పరీక్షల విధుల్లో పాల్గొన్న వారికి రూ.17, రూ.33, రూ.66 ఇవ్వడం ఏంటని మండిపడుతున్నారు. బయట చిన్నపాటి లేబర్ కూలి సైతం రూ.500 నుంచి రూ.700 ఇస్తున్నారనీ, మరీ దారుణంగా వందలోపు ఇవ్వడం ఏంటంటూ ఉపాధ్యాయ సంఘాల నేతలు మండిపడుతున్నారు. కేంద్రాల్లో ఏర్పాట్ల కోసం కంటింజెన్సీ ఫండ్ కూడా ఒక్కో విద్యార్థికి రూ.10 ఇవ్వడం సరికాదనీ, రూ.50కి పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఏటా పరీక్షల నిర్వహణ, స్పాట్‌కు చెల్లించే మొత్తం బడ్జెట్ సైతం రానురాను పెరగాలి కానీ, ప్రభుత్వాలు తగ్గిస్తున్నాయన్న విమర్శలున్నాయి. ఉమ్మడి జిల్లాగా ఉన్నపుడు భారీగా బడ్జెట్ విడుదల చేసేవారు. పోనుపోను... ఈ మొత్తాన్ని తగ్గిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ ఏడాది కూడా రూ.70 లక్షలు ఇస్తామని విద్యాశాఖ ప్రకటించినట్లు తెలుస్తోంది. ఇంతవరకూ ఆ మొత్తం విడుదల చేయకపోవడంతో అందరూ బిల్లులు పెట్టి ఎదురుచూస్తున్నారు.

పరీక్షలు, స్పాట్ సక్సెస్ చేసినా...



ఉపాధ్యాయులు పదో తరగతి పరీక్షలు, స్పాట్ సక్సెస్ చేసినా... నేటికీ వాళ్లకు రెమ్యూనరేషన్, ఇతర అలవెన్సులు చెల్లించలేదు. విద్యాశాఖ సకాలంలో నిధులు కేటాయించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా విధుల్లో పాల్గొన్న సీఎస్‌లు, డీఓలు, ఇన్విజిలేటర్లు, స్క్వాడ్ అధికారులు, క్యాంపు, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు, ఇతర అధికారులకు వెంటనే చెల్లించాలి. ఈ విషయంలలో జాప్యం చేయడం సరికాదు.

-గౌని పాతిరెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదరి

టీచర్లకు న్యాయం చేయాలి



టీచర్లు దూరప్రాంతాల నుంచి వచ్చి స్పాట్ విధుల్లో పాల్గొన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల నుంచి కూడా వ్యయ ప్రయాసలతో వచ్చి డ్యూటీలు చేశారు. వారికి రెమ్యూనరేషన్ ఇంతవరకూ ఇవ్వలేదు. విద్యాశాఖ నేటికీ బడ్జెట్ విడుదల చేయకపోవడం బాధాకరం. ఇప్పటికైనా వెంటనే బడ్జెట్ విడుదల చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి.

- రవీంద్ర, జిల్లా ప్రధానకార్యదర్శి, గిరిజన ఉపాధ్యాయ సంఘం

ఏటా ఆలస్యం తగదు



ఏటా పదో తరగతి మూల్యాంకనానికి సంబంధించి టీచర్లకు డబ్బు సకాలంలో చెల్లించకపోవడం సరికాదు. విద్యార్థుల దగ్గర నుంచి ఏటా కట్టించుకునే పరీక్షల ఫీజులోనే స్పాట్‌కు సంబంధించిన మొత్తం కూడా ఉంటుంది. అలాంటపుడు ప్రభుత్వం స్పాట్ డబ్బు చెల్లింపు విషయంలో అలసత్వం వీడాలి. ఎప్పటికప్పుడు స్పాట్ డ్యూటీలో పాల్గొన్న టీచర్లకు బకాయిలు ఉంచకుండా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా వెంటనే రెమ్యూనరేషన్, ఇతర అలవెన్సులు చెల్లించాలి.

- కోటేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి, యూటీఎఫ్

చివరిరోజే ఇస్తే చాలా సంతోషం



పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్‌కు వచ్చిన టీచర్లకు స్పాట్ చివరిరోజే రెమ్యూనరేషన్ ఇస్తే వారు చాలా సంతోషిస్తారు. ప్రభుత్వం ఇంతవరకూ బడ్జెట్ విడుదల చేయలేదు. ఇది చాలా అన్యాయం. గత సప్లిమెంటరీ పేపర్ల మూల్యాంకనం అమౌంట్ కూడా చెల్లించలేదు. తక్షణమే ప్రభుత్వం చొరవ చూపి, రెమ్యూనరేషన్ అందేలా చూడాలి. ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకోవాలి.

-రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ

ప్రభుత్వం తక్షణం నిధులివ్వాలి



ఉపాధ్యాయులు, రాష్ట్ర సామాన్య ప్రజలు 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి నేతలపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించారు. ఈ ప్రభుత్వం విద్యారంగానికి, ఉపాధ్యాయవర్గానికి అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా... విద్యారంగ అవసరాలకు తక్షణం నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పదో తరగతి పరీక్షలు, స్పాట్ బడ్జెట్ విడుదల చేయాలి.

-బండారు శంకర్, జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి, ఎంఈఎఫ్

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

టీడీపీ జిల్లా కార్యాలయంలో ప్రజాదర్బార్

పలు సమస్యలపై వినతుల స్వీకరణ


మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న ప్రజలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. జిల్లా పర్యటనకు గురువారం వచ్చిన ఆయన స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు, బండారు శ్రావణి శ్రీలతో కలిసి ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 46 మంది తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఎక్కువ శాతం రెవెన్యూ సమస్యల పై వచ్చాయి. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడు తూ గడచిన ఐదేళ్లలో ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే అవకాశమే లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ప్రజా దర్బార్‌లు నిర్వహించి, ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వంలో నీరు-చెట్టు పథకం బిల్లులు ఆపేశారని, ఆయా బిల్లులు మంజూరు చేసేలా చూస్తామన్నారు. గుంతలు లేని రోడ్లతోపాటు గ్రామాల్లో సీసీ రోడ్లు వేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. హౌసింగ్ పథకంలో ఎస్సీ, బీసీలకు రూ.50వేలు అదనంగా ఇస్తామన్నారు. 2014-19లో అనంత జిల్లా అభివృద్ధికి సీఎం చంద్రబాబు హంద్రీనీవాతోపాటు కియ పరిశ్రమను తెచ్చారన్నారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించారన్నారు. పరిశ్రమలు రావడంతోపాటు సోలార్, విండ్ ప్రాజెక్టుల ఏర్పాటుతో జిల్లా సమగ్ర స్వరూపం మారిందన్నారు. గత ప్రభుత్వంలో 8 శాతంగా ఉన్న జీఎస్‌డీపీని 12 శాతానికి పెంచామన్నారు. దీనిని 15 శాతానికి పెంచడ మే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం ఉగాది రోజు పీ-4 కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారన్నారు. సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి నియోజకవర్గంలో 10 వేల ఇళ్లకు సోలార్ ప్రాజెక్టును మంజూరు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఒక్కో ఇంటికి రూ.78వేలు సబ్సిడీ వర్తింపజేస్తామ న్నారు. ఎస్సీలకు ఉచితంగా ఇస్తారన్నారు. బీసీలకు అదనంగా రూ.25వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 20 లక్షలు ఉద్యోగాల కల్పనకు మంత్రి లోకేశ్ సబ్ కమిటీ వేసుకొని ముందుకు వెళుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ మేయర్ స్వరూప, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్, టీడీపీ రాష్ట్ర నాయకులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, తలారి ఆదినారాయణ, రాయల్ మురళీ, నాయకులు గంగారామ్, సుధాకర్ నాయుడు, కుంచెపు వెంకటేష్, కూచి హరి, స్వామిదాస్, పోతుల లక్ష్మీనరసింహులు, కురబ నారాయణస్వామి పాల్గొన్నారు.

బండమీదపల్లి.. పాడిలో మేటి

రోజూ 8 వేల లీటర్లు డెయిరీకి సరఫరా

జిల్లాలోనే అత్యధికంగా పాల ఉత్పత్తి

ఎక్కువ మందికి జీవనాధారం

6

శుభ్రత.. సంపద..

వినియోగంలోకి చెత్త నుంచి సంపద కేంద్రాలు

టీడీపీ హయాంలో పెద్దఎత్తున నిర్మాణం

మూలనపడేసిన వైసీపీ ప్రభుత్వం

పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టిపై ప్రభుత్వం దృష్టి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టిపై రాష్ట్రప్రభుత్వం దృష్టిపెట్టింది. ఒకవైపు ఆదాయం పెంచుకోవడం, మరోవైపు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. అందులో భాగంగా గత వైసీపీ పాలనలో నిరుపయోగంగా మారిన చెత్త నుంచి సంపద కేంద్రాలను పునఃప్రారంభించాలని నిర్ణయించింది. వాటిని వినియోగంలోకి తీసుకొచ్చే చర్యలు చేపట్టింది. అందుకు సంబంధించి పంచాయతీ అధికారులు కసరత్తు ప్రారంభించారు. మండల వ్యాప్తంగా నిరుపయోగంగా ఉన్న వాటిని వినియోగంలోకి తెచ్చారు.

పట్టించుకోని వైసీపీ..

రాష్ట్రంలో టీడీపీ హయాంలో (2014-2019) గ్రామ పంచాయతీలపై ప్రత్యేక శ్రద్ధ చూపింది. ఆదాయ వనరులను పెంచేందుకు ఉపాధి హామీ పథకం నిధులతో చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్మాణాన్ని చేపట్టింది. బొమ్మనహాళ్ మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉండగా.. 16 కేంద్రాలను పూర్తిచేసింది. మరో మూడు కేంద్రాలు నిర్మాణ దశలో ఉంది. అప్పట్లో కొన్ని కేంద్రాలను వినియోగంలోకి తెచ్చారు. పూర్తిస్థాయిలో ఆదాయం పెంచుకునే సమయంలో రాష్ట్రంలో ఎన్నికలు వచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక చెత్త నుంచి సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. సంపదకేంద్రాలు మరుగునపడడంతో కొన్ని మందుబాబులు, జూదరులకు అడ్డాగా మారాయి. గతేడాది ఏర్పాటైన కొత్త ప్రభుత్వం గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ సారించింది. ఇటు పారిశుధ్యం మెరుగు, ఇటు ఆదాయం పెంపు లక్ష్యంగా వీటిని వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఇప్పటికే షెడ్ల నిర్మాణం పూర్తయి వినియోగించని వాటిని పునరుద్ధరించారు.

ప్రజలకు అవగాహన

గ్రామాల్లో గ్రీన్ అంబాసిండర్లను ఏర్పాటు చేశారు. రోజూ చెత్తను సేకరించడం ద్వారా గ్రామాల్లో పారిశుద్యం మెరుగవుతుంది. వీటిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈఓపీఆర్డీ దాస్ గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తున్నారు. కేంద్రాలకు తీసుకొచ్చే చెత్త నుంచి సంపద ఎలా సృష్టించాలన్న దానిపై కార్మికులకు కూడా అవగాహన కల్పిస్తున్నారు.


గ్రీన్ అంబాసిడర్లతో ఎరువు తయారు చేయిస్తున్న అధికారులు

12 కేంద్రాల్లో చెత్తతో ఆదాయం

మండలంలోని బండూరు, గోనేహళ్, సింగానహళ్లి, నేమకల్లు, ఉంతకల్లు, కురవళ్లి, శ్రీధరఘట్ట, కొళగానహళ్లి, దర్గాహోన్నూరు, గోవిందవాడ, హరేసముద్రం, కళ్లుహోళ గ్రామాల్లో చెత్తతో సంపద తయారు చేస్తున్నారు. జిల్లాలోని బుక్కరాయసముద్రం నుంచి వానపాములను కొనుగోలు చేసి, వర్మీ కాంపోస్ట్ తయారు చేస్తున్నారు. గ్రీన్ అంబాసిడర్లు ఉదయమే పారుశుధ్య పనులకు వెళ్లి చెత్తను తీసుకొచ్చి కేంద్రాల్లో వదిలిన వానపాములకు వేస్తున్నారు. ఎరువు తయారవుతున్న నేపథ్యంలో గ్రీన్ అంబాసిడర్లలో ఉత్సాహం పెరిగింది. ఉంతకల్లు గ్రామంలో రోజూ ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేరుచేసి, తీసుకొస్తున్నారు. 2024లో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గ్రామాల్లో గతం కంటే పారిశుధ్య కాస్త మెరుగుపడుతోంది.

కేంద్రాలన్నింటినీ వినియోగంలోకి తెస్తాం



మండలంలోని చెత్త నుంచి సంపద కేంద్రాలన్నింటినీ వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే 12 కేంద్రాల్లో వానపాములను వదిలి వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నాం. గ్రామాలు పరిశుభ్రంగా ఉండటంతోపాటు పంచాయతీలకు ఆదాయం కూడా పెంచుతాం. గృహ యజమానులు చెత్తను డ్రైనేజీలో, రోడ్ల మీదా వేయకపోవడంతో దోమలు కూడా పెరగవు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచితే గ్రీన్ అంబాసిడర్లు వచ్చి, తీసుకెళ్తారు.

- దాస్, ఈఓపీఆర్డీ, బొమ్మనహాళ్



సీఐ యుగంధర్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న ఎస్పీ

నేరాలను కట్టడి చేయండి

- ఎస్పీ జగదీష్
- పోలీస్ అధికారులతో నేర సమీక్ష

అనంతపురం క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మట్కా, పేకాట, గంజాయి, ఇసుక అక్రమ రవాణా తదితర వాటిని కట్టడి చేయాలని జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశించారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. జిల్లాలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలు, ఇతర కేసుల నమోదు, ఛేదనల గురించి సర్కిళ్ల వారిగా సమీక్షించి, సీడీ ఫైల్స్ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల కేసులలో దర్యాప్తు, రికవరీల గురించి పోలీస్ అధికారులతో సమీక్షించారు. పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న కేసుల దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టం(సీసీటీఎన్ఎస్)లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ-సాక్ష్య పోర్టల్‌లోనూ క్రైం సీన్స్‌కు సంబంధించిన చిత్రాలు ఉంచాల న్నారు. సమావేశంలో తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు వెంకటేశులు, రవిబాబు, శ్రీనివాస్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

- ప్రస్తుతం పామిడిలో సీఐగా పని చేస్తున్న యుగంధర్ 2022లో రాయదుర్గం సీఐగా పనిచేశారు. అప్పుడు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర గ్యాంగుల నుంచి 24తుపాకులు సీజ్ చేశారు. దీన్ని గుర్తించి రాష్ట్ర డీజీపీ డిస్క్ అవార్డుకు ఎంపిక చేశారు. అవార్డును ఎస్పీ ప్రదానం చేశారు.



బండమీదపల్లిలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డు

బండమీదపల్లి.. పాడిలో మేటి



పాడి ఆవులు

- రోజూ 8 వేల లీటర్లు డెయిరీకి సరఫరా
- జిల్లాలోనే అత్యధికంగా పాల ఉత్పత్తి
- ఎక్కువ మందికి జీవనాధారం

ఒకప్పుడు ఆ గ్రామంలో అందరికి వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయంలో పెట్టుబడులు ఎక్కువ కావడం, దిగుబడి తగ్గడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులకు నష్టాలే మిగిలేవి. ఈ నేపథ్యంలో రైతులు పాడి పెంపకంపై దృష్టి సారించారు. వ్యవసాయంతో పాటు పాడి పశువులను పోషించడం ప్రారంభించారు. కష్టానికి తగిన ఫలితం లభిస్తుండడంతో రైతులు, రైతు కూలీలు పాడినే జీవనాధారం చేసుకున్నారు. రాప్తాడు మండలం బండమీదపల్లి రైతులు పాల ఉత్పత్తిలో ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా డెయిరీలకు పాలు సరఫరా చేస్తున్నారు.

రాప్తాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిలో ఆదర్శంగా నిలుస్తున్నారు రాప్తాడు మండలంలోని బండమీదపల్లి రైతులు. ఈ గ్రామం అనంతపురం జిల్లా కేంద్రానికి 30 కిలో మీటర్ల దూరంలో ఉంది. గ్రామంలో వెయ్యికిపైగా కుటుంబాలు, 4వేలకు పైగా జనాభా ఉంది. గ్రామంలో అందరూ రైతులు, రైతు కూలీలే. వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. వేరుశనగ, వరి, చీనీ, కంది తదితర పంటలు సాగు చేసేవారు. కాలక్రమేణా వ్యవసాయం భారం కావడంతో రైతులు పాడి పశువుల పెంపకంపై ఆసక్తి చూపారు. తమకున్న పొలంలో కొంత భాగం పశుగ్రాసం సాగు చేసుకుని మేతగా ఉపయోగిస్తున్నారు. తర్వాత చాలా మంది పాడి వైపే మొగ్గుచూపారు. హిందూపురం, పుంగనూరు, చింతామణి, కర్ణాటకలోని వేర్వేరు ప్రాంతాల నుంచి మేలు జాతి జెర్సీ ఆవులను కొనుగోలు చేసి జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు. ఒక్కో కుటుంబానికి రెండు నుంచి 10 పాడి పశువులు ఉన్నాయి. కొంత మంది 15 ఆవులను పోషిస్తున్నారు. కుటుంబ సభ్యులందరూ కష్టపడి పని చేస్తూ కష్టానికి తగిన ప్రతి ఫలం పొందుతున్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పాలు పిండి గ్రామంలోని డెయిరీలకు పోస్తున్నారు. ఏజెంట్లు రైతుల నుంచి సేకరించిన పాలను జిల్లాలోని పలు ప్రైవేటు డెయిరీలకు సరఫరా చేస్తున్నారు. గ్రామంలో ప్రస్తుతం 1300కు పైగా పాడి పశువులు ఉన్నాయి. ప్రతి రోజూ ఉదయం 4 వేల లీటర్లు, సాయంత్రం 4 వేల లీటర్లు మొత్తం 8 వేల లీటర్ల పాలు గ్రామం నుంచి డెయిరీలకు సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అత్యధికంగా బండమీదపల్లి నుంచి పాలు సరఫరా అవుతున్నాయని పశువైద్యాధికారులు చెబుతున్నారు. పాల నాణ్యతను బట్టి లీటరు ఆవు పాలకు రూ. 30 నుంచి రూ.36 రైతులకు చెల్లిస్తున్నారు. డెయిరీ ఏజెంట్లు రైతులకు 15 రోజులకు ఒకసారి బిల్లు అందచేస్తారు.



సాగుచేసిన పశుగ్రాసం

పాడి పశువులే జీవనాధారం



మాకు 10 పాడి పశువులు ఉన్నాయి. వరిగడ్డి, వేరుశనగ పొట్టు కొనుగోలు చేసి పశువులను పోషిస్తున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పశువుల వద్దే ఉంటూ జాగ్రత్తగా కాపాడుకుంటున్నాం. గ్రామంలో పశువైద్యశాల ఉండటంతో సకాలంలో వైద్య పరీక్షలు చేయిస్తున్నాం. ప్రతి రోజూ 80 లీటర్ల పాలు డెయిరీకి సరఫరా చేస్తున్నాం. -నరసింహులు, రైతు, బండమీదపల్లి

ప్రభుత్వం చేయూత

ప్రభుత్వం పాడి రైతులకు చేయూతనిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత దాదాపు 10 గోకులం షెడ్లు మంజూరు చేయించారు. 2024లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా బండమీదపల్లికి అత్యధికంగా 24 గోకులం షెడ్లు మంజూరు చేశారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2 లక్షలు మంజూరు చేస్తోంది. బ్యాంకులు కూడా పాడి పశువులకు రుణాలు ఇస్తుండటంతో ఎక్కువ మంది రైతులు ఇటువైపు మొగ్గు చూపుతున్నారు.

రోజుకు 140 లీటర్ల పాలు పోస్తున్నాం



మాకు 14 పాడి పశువులు ఉన్నాయి. కుటుంబ సభ్యులందరం కష్టపడి పని చేస్తున్నాం. రెండు ఎకరాల్లో పశుగ్రాసం సాగు చేశాం. ప్రతి రోజూ ట్రాక్టర్‌లో పశుగ్రాసం కోసుకుని వచ్చి ఆవులకు మేతగా వేస్తాం. ఉదయం 70 లీటర్లు, సాయంత్రం 70 లీటర్లు మొత్తం రోజుకు 140 లీటర్ల పాలు డెయిరీకి పోస్తున్నాం. -గోవిందు, రైతు, బండమీదపల్లి

గోకులం షెడ్డు నిర్మించుకున్నాం



వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంకం చేపడుతూ జీవనం సాగిస్తున్నాం. మాకు నాలుగు ఆవులు ఉన్నాయి. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గోకులం షెడ్డు మంజూరైంది. షెడ్డు నిర్మించుకుని పశువులు పోషిస్తున్నాం. పాడి పశువులకు గోకులం షెడ్లు ఎంతో ఉపయోగకరం. -కదిరప్ప, రైతు, బండమీదపల్లి

సకాలంలో వైద్యసేవలు

గ్రామంలో పాడి పశువులు ఎక్కువగా ఉన్నాయి. పశువులకు జ్వరం, పొదుగు వాపు, ఇతర వ్యాధులు సోకితే రైతులు వెంటనే పశువైద్యశాలకు తీసుకువస్తున్నారు. పశువులకు టీకాలు వేసి వ్యాధులు నయం చేస్తున్నాం. గాలికుంటు వ్యాధి టీకాలు, ఎద టీకాలు సకాలంలో వేస్తున్నాం. పాడి పశువులకు బీమా కూడా చేస్తున్నాం. -సోమేశ్వరి, పశువైద్యాధికారి, బండమీదపల్లి

రైతులకు ప్రభుత్వం చేయూత



రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు సబ్సిడీపై గోకులం షెడ్లు, డ్రిప్పు, స్ప్రింక్లర్లు, ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలు అందిస్తోంది. ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో హంద్రీనీవా కాలువ నుంచి పిల్లకాలువ ద్వారా ప్రతి ఏటా బండమీదపల్లి చెరువుకు నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామంలో రైతులు వ్యవసాయం, పాడి పశువులు పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. -శ్రీనివాసులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, బండమీదపల్లి

నత్తకు నడకలు నేర్పేలా..

- ఏళ్లుగా సాగుతున్న తాగునీటి పథకం పనులు
- భారీగా పెరిగిన అంచనా వ్యయం
- ఈ వేసవిలో తాగునీటికి ఇబ్బందులే..!



అర్ధంతరంగా ఆగిన ట్యాంకు నిర్మాణం

మడకశిర, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఐదు మున్సిపాల్టీల పరిధిలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వేసవిలో తాగునీటి సమస్యలు తప్పేలా లేవని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లుగా ..

ఐదు మున్సిపాల్టీల్లో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం కాంప్రహెన్సివ్ వాటర్‌సప్లయ్ ఇంప్రూవ్‌మెంట్ పథకం కింద నిధులు మంజూరు చేసింది. ఇందులో మడకశిర పట్టణానికి రూ.63కోట్ల నిధులు మంజూరు చేశారు. ఏఐఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు) ద్వారా 70 శాతం, ప్రభుత్వం నుంచి 30 శాతం నిధులతో ఈపనులు జరుగుతున్నాయి. పనులు రెండేళ్లలో పూర్తి కావాల్సి ఉంది. కానీ అలా జరగకపోవడంతో మరో రెండేళ్లు పొడిగించారు. అయినా ప్రయోజనం లేదు. మడకశిర సమీపంలోని చెరువులో సంపు, ఏడు చోట్ల ట్యాంకుల నిర్మాణం జరుగుతోంది. ఇప్పటి వరకు 30 శాతం పనులే జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. మడకశిర చెరువులో సంపు ఏర్పాటుచేసి, అక్కడ నుంచి పక్కనే ఉన్న గుట్టపై వాటర్‌ప్లాంటు నిర్మించి, అక్కడ నీటిని శుద్ధిచేసి మెళవాయి వద్ద నిర్మించిన ట్యాంకుకు పైపుల ద్వారా నీటిని సరఫరా చేసి, అక్కడ నుంచి పట్టణానికి రోజూ నీటిని అందించనున్నారు. పట్టణంలో ఏడు ట్యాంకులను నిర్మిస్తున్నారు. జూనియర్ కళాశాల ఆవరణలో 7లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, ఎస్సీ కాలనీలో 5లక్షల లీటర్లు, పావగడ రోడ్డు సమీపంలో 6లక్షల లీటర్లు, బేగార్లపల్లి, మారుతీనగర్, గొల్లహట్టి, మల్లినాయకనపల్లిలో ఒక్కొక్కచోట 3లక్షల లీటర్ల సామర్థ్యంగల ట్యాంకులను నిర్మిస్తున్నారు.

పెరిగిన వ్యయం

ఉమ్మడి జిల్లాలోని పామిడి, మడకశిర, పుట్టపర్తి, కళ్యాణదుర్గం, గుత్తి మున్సిపాల్టీల్లో ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి కనెక్షన్ ఇవ్వడానికి కాంప్రహెన్సివ్ వాటర్ సప్లయ్ ఇంప్రూవ్‌మెంట్ పథకం ద్వారా రూ. 545 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. పనులు ప్రారంభించి ఏళ్లు గడిచినా నేటికి 20 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. దీంతో నిర్మాణ వ్యయం రూ.545 కోట్ల నుంచి రూ.628 కోట్లకు పెరిగింది. ఈక్రమంలో ప్రస్తుతం ఉన్న ఎస్ఆర్ రేట్ల ప్రకారం అధికారులు అంచనాలు వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా రు. ఇప్పటి వరకు అన్ని చోట్ల ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణపు పనులు ప్రారంభం అయ్యి వివిధ దశలలో ఉన్నాయి. సకాలంలో నిధులు విడు దల కాకపోవడం,




ప్రారంభంలో కరోనా కారణంగా పనులు నత్తనడకన సాగాయి. దీంతో నిర్మాణ వ్యయం 15శాతానికి పైగా పెరిగింది. తాగునీటి పథకం పనులు పూర్తి అయ్యేందుకు మడకశిర మున్సిపాల్టీకి రూ.73 కోట్లు, పుట్టపర్తి మున్సిపాల్టీకి రూ.117 కోట్లు అవసరమని అంచనా వేసి ప్రభుత్వానికి కొత్తగా ప్రతిపాదనలు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఇప్పటిదాకా చేసిన పనుల బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం రూ.14కోట్లు చెల్లించింది. ఇంకా మడకశిర, పుట్టపర్తి మున్సిపాల్టీలలో జరిగిన పనులకు సంబంధించి రూ.ఐదు కోట్ల దాకా చెల్లించాల్సి ఉంది. పామిడి నగర పంచాయతీ నుంచి గ్రామ పంచాయతీగా మారడంతో అక్కడ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

ప్రతిపాదనలు పంపాం: ఆదినారాయణ, జిల్లా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారి


రెండు వారాల్లో తాగునీటి పథకానికి సంబంధించిన టెండర్లు పిలుస్తాం. ఇప్పటికి 20 శాతం దాకా పనులు పూర్తి అయ్యాయి. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు పామిడి, మడకశిర, కళ్యాణదుర్గం, గుత్తి, పుట్టపర్తి మున్సి పాల్టీలకు తాగునీటి పథకానికి రూ.545 కోట్లదాకా నిధులు మంజూరయ్యాయి. అందులో రూ.19 కోట్ల దాకా బిల్లులు చెల్లించాల్సి ఉంది. పెండింగ్ బిల్లులు 14 కోట్ల దాకా చెల్లించాం. ఇంకా 5 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. త్వరలోనే ఆ బిల్లులు కూడా చెల్లిస్తాం.

25 శాతం లోపు పనులు జరిగిన వాటిని రద్దు చేస్తూ, చేపట్టవలసిన పనులకు అంచనాలు వేసి రూ.628 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతున్నాం. నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పనులు చేపడతాం.



GOVERNMENT OF ANDHRA PRADESH
Dept.for the welfare of Differently Abled, Transgenders & Senior Citizens, Ananthapuramu Dist
IDENTITY CARD FOR SENIOR CITIZENS
Regn.No. Date :
Name :
Father / Husband :
Date of Birth & Age :
Aadhar No. :
Assistant Director
Welfare of Differently Abled, TG & SC, Ananthapuramu Dist

సీనియర్ సిటిజన్స్ ఐడీ కార్డు ముందు భాగం



Address :
Phone / Cell No. :
In Case of Emergency, Contact Name :
Phone / Cell No. :
Blood Group
Occupation
Signature of Card Holder

సీనియర్ సిటిజన్స్ ఐడీ కార్డు వెనుకభాగం

పండుటాకులకు అండ

- ఎస్‌సీఐడీ కార్డుతో ఎన్నెన్నో ప్రయోజనాలు
- బస్సు, రైలు టిక్కెట్‌పై రాయితీ
- బ్యాంకుల్లో ఎఫ్‌డీలపై అధిక వడ్డీ రేట్లు
- దేవాలయాల్లో ప్రత్యేక దర్శనాలకు అవకాశం
- ప్రభుత్వ పింఛన్ పొందే అవకాశం
- దరఖాస్తు చేసుకున్న రెండ్రోజుల్లోపే మంజూరు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పండుటాకులకు కొత్త ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారికి పథకాలు వర్తింపజేసే దిశగా వయోవృద్ధుల గుర్తింపు (ఎస్‌సీఐడీ) కార్డు మంజూరును సులభతరం చేసింది. మాన్యువల్‌గానూ కార్డు అందజేస్తోంది. అంతేకాదు, దరఖాస్తు చేసుకున్న రెండ్రోజుల్లోపే కార్డు మంజూరు చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. 60 ఏళ్లు పైబడిన వారికి ప్రభుత్వం పింఛన్ అందిస్తోంది. వీటితోపాటు మరిన్ని సంక్షేమ పథకాలు, సేవలను వినియోగించుకునేందుకు ఎస్‌సీఐడీ కార్డును ప్రవేశపెట్టింది. 60 ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరూ ఈ కార్డుకు అర్హులు. ఈ కార్డు పొందిన వృద్ధులకు బస్సు, రైలు టిక్కెట్ ధరల్లో 40 శాతం వరకు తగ్గింపు, దేవాలయాల్లో ప్రత్యేక దర్శనాలు, ఎఫ్‌డీ ఖాతాలపై అధిక వడ్డీ రేట్లు, ప్రభుత్వ పింఛన్ పొందని వారికి ఈ ఐడీ కార్డు ఆధారంగా అమలు చేసేలా నిర్ణయం తీసుకుంది. జిల్లావ్యాప్తంగా 6 లక్షలకుపైగా 60 ఏళ్లు పైబడిన వృద్ధులున్నట్లు సమాచారం. వీరిలో ఇప్పటికే 5 లక్షలకు పైగా వృద్ధులు ప్రభుత్వ పింఛన్ పొందుతున్నట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. ఇంకా వేల సంఖ్యలో వృద్ధులు ప్రభుత్వ పింఛన్‌తోపాటు.. కార్డు ద్వారా అందే సేవలకు దూరంగా ఉన్నారనే చెప్పాలి. వీరందరికీ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖాధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్డుతో వృద్ధులకు సంక్షేమ పథకాలు, సేవలు మరింత సులభతరంగా అందే అవకాశాలున్నాయి వారు పేర్కొంటున్నారు.



విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయం

టిక్కెట్ ధరల్లో తగ్గింపు...

ఎస్‌సీఐడీ కార్డుతో ఆర్టీసీ బస్సులు, రైలు ప్రయాణాల్లో టిక్కెట్ ధరల్లో తగ్గింపు ఉంటుంది. సీనియర్ సిటిజన్స్ ఐడీ కార్డు పొందిన వయోవృద్ధులు బస్సులు, రైలులో ప్రయాణించే సమయంలో టిక్కెట్ ధరల్లో 40 శాతం వరకు తగ్గింపు వర్తిస్తుంది. రాష్ట్రమంతా ఏ జిల్లాకు వెళ్లాలన్నా ఈ కార్డు ఉపయోగపడుతుంది. ఆరోగ్య పరిస్థితులు క్షీణించిన వృద్ధులకు సహాయకులుగా ఉన్న వ్యక్తులకు సైతం బస్సు, రైలు ప్రయాణాల్లో ఈ ధరలు వర్తింపజేసింది. బ్యాంకుల్లో ఎఫ్‌డీ ఖాతాలు కలిగిన వయోవృద్ధులకు 5 నుంచి 6 శాతం వడ్డీ రేట్ల పెంపునకు అనుమతులిచ్చింది.

దేవాలయాల్లో ప్రత్యేక దర్శనాలు

దేవాలయాల్లో పూజల్లో పాల్గొనాలంటే... సాధారణ ప్రజలకే కష్టంతో కూడుకున్న పని. పండుగ రోజులు, ప్రత్యేక దినాల్లో క్యూలైన్లో గంటల తరబడి నిలబడాల్సి వస్తుంది. ఇక వృద్ధుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలోనే ఎస్‌సీఐడీ కార్డుతో దేవాలయాల్లో వృద్ధులకు ప్రత్యేక దర్శనం కల్పించే వెసులుబాటు కల్పించింది. కార్డు కలిగిన వృద్ధులు క్యూలైన్లలో నిరీక్షించాల్సిన అవసరం లేకుండా.. వారికి ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. ఆ మేరకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

కార్డు ఆధారంగా పింఛన్...

ఎస్‌సీఐడీ కార్డుతో రాష్ట్ర ప్రభుత్వం అందించే పింఛన్ నేరుగా పొందే అవకాశం కల్పించింది. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు ఈ ఐడీ కార్డు ఆధారంగా పింఛన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. గతంలో పింఛన్ కోసం సచివాలయాలు, ఇంటర్నెట్ సెంటర్లలో దరఖాస్తులు చేసుకునేందుకు వృద్ధులు అనేక ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఈ ఐడీ కార్డు కలిగిన వృద్ధుల్లో ఎవరికైనా ప్రభుత్వ పింఛన్ అందకపోతే... విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ అధికారుల సిఫార్సు లేఖతో పొందే అవకాశం ఉంటుంది.


రెండ్రోజుల్లోపే...

సీనియర్ సిటిజన్ ఐడీ కార్డును వృద్ధులు ఈజీగా పొందవచ్చు. 60 సంవత్సరాలు పైబడినట్లు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌గానీ, పాన్ నంబర్‌గానీ, స్కూల్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలి. ఫొటోలతో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలి. దరఖాస్తు అందజేసిన రెండ్రోజుల్లోపే సీనియర్ సిటిజన్స్ ఐడీ కార్డును దరఖాస్తుదారులకు అందజేస్తారు.

వృద్ధులు కార్డును ఉపయోగించుకోవాలి



ఉమ్మడి జిల్లాలో 60 ఏళ్లపైబడిన వృద్ధులందరూ సీనియర్ సిటిజన్స్ ఐడీకార్డును పొందాలి. ఈ కార్డు ద్వారా అనేక పథకాలు, సేవలను పొందవచ్చు. ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500 మందికిపైగా కార్డును పొందారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అర్హత కలిగిన వృద్ధులు కార్యాలయంలో దరఖాస్తు అందజేస్తే... రెండ్రోజుల్లోపు కార్డు మంజూరు చేస్తాం. - వినోద్, ఏడీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ



రాసిగా పోసిన నిమ్మకాయలు

నిమ్మ ధర పైపైకి..

- ఎండల ప్రభావంతో పెరిగిన రేట్లు
- దిగుబడి లేకపోవడమూ కారణమే
- మే నెలలో మరింత పెరిగే అవకాశం

పుట్లూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేసవి నిమ్మ రైతులకు బాగా కలిసొస్తోంది. ఎండలు మండిపోతుండడంతో నిమ్మకు డిమాండ్ పెరిగింది. దిగుబడి కూడా లేకపోవడంతో ధరలు పైపైకి చేరుతున్నాయి. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్యాకెట్ నిమ్మకాయల ధర రూ.4500 నుంచి రూ.4800 వరకు పలుకుతోంది. మండలంలోని పుట్లూరు, పి.చింతలపల్లి, సూరేపల్లి, నాయకునిపల్లి, బాలాపురం, మడ్డిపల్లి, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి తదితర గ్రామాల పరిధిలో నిమ్మపంటను 250 ఎకరాల విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో దిగుబడి తగ్గిపోవడంతోనే ధరలు పెరిగినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి లేదని తెలుస్తోంది.

మూడు నెలలే కీలకం..

నిమ్మపంట విక్రయించాలంటే ఏడాదిలో మూడునెలలే కీలకమని రైతులు చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఈ పంటకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీంతో ఈ పంట ధరలకు రెక్కలు వస్తాయని రైతులు తెలిపారు. ఏడాది పొడవునా పంట దిగుబడి తీసినా ఆశించిన ధరలు ఉండవు. వేసవి ప్రారంభం కావడంతోనే ధరలు పెరుగుతాయి. ఈ ఏడాది జనవరిలో ప్యాకెట్ నిమ్మకాయల ధర రూ.600 ఉండగా, ఫిబ్రవరి వచ్చేసరికి ఏకంగా రూ.1500కి పెరిగింది. మార్చిలో రూ.2500కి చేరుకుంది. ప్రస్తుతం రూ.4500 నుంచి రూ.4800 వరకు ధర ఉంటోంది. మే నెలలో మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు వంద చెట్లు సాగుచేస్తే దిగుబడి 100 నుంచి 150 ప్యాకెట్ల వరకు దిగుబడి వస్తోంది. సాధారణంగా ప్యాకెట్‌కు సైజును బట్టి 800 నుంచి 1,200 నిమ్మకాయలను లోడ్ చేస్తుంటారు. రాయలసీమ ప్రాంతంలో పండే నిమ్మకాయలు నాణ్యతగా ఉండడంతో ఎక్కువ డిమాండ్ ఉంటోంది. ఈ ప్రాంతంలో పండిన నిమ్మకాయలను గోవా, కేరళ, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.



నిమ్మచెట్లు

ధర ఆశాజనకంగా ఉంది..



ఈ ఏడాది నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఐదెకరాల్లో పంట సాగు చేశా. ఏడాది ప్రారంభంలో ధర అంతంతమాత్రంగానే ఉండేది. నెలరోజుల నుంచి పెరుగుతూ వస్తోంది. తక్కువ ధర ఉన్నపుడు 200 ప్యాకెట్లుపైగానే విక్రయించా. ధర పెరిగినపుడు ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. ఈ ధర ఇలాగే కొనసాగితే నిమ్మరైతుల కష్టాలు తీరినట్లే.

- రమేష్‌నాయుడు, రైతు, సూరేపల్లి

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మహేష్‌కుమార్ (ఫైల్)

పెద్దవడుగూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తిఅనంతపురం గ్రామ సమీపాన 44వ జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ వద్ద గురువారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొని బెంగళూరుకు చెందిన మహేష్‌కుమార్(46) దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహేష్ కుమార్ ప్రైవేటు కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తుండేవారు. స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనాల్లో సిక్కిం రాష్ట్రానికి విహారయాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గుత్తిఅనంతపురం సమీపాన గల పెట్రోల్ బంక్ వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో మహేష్‌కుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాద స్థలాన్ని ఎస్ఐ ఆంజనేయులు పరిశీలించి, మృతదేహాన్ని పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మహేష్‌కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు మహిళల ఆత్మహత్య

గోరంట్ల/ఉరవకొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు. గోరంట్ల ఒకటో వార్డుకు చెందిన అనితాబాయి (49) విషం తాగి గురువారం ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త విజయ్‌కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వారి ఒక్కగానొక్క కుమారై కర్ణాటకలో ఆయుర్వేద వైద్యురాలి కోర్సు చదువుతున్నారు. ఉదయం విజయ్‌కుమార్ పాఠశాలకు వెళ్లాక అనితాబాయి ఇంట్లోనే విషం తాగింది. అస్వస్థతకు లోనైన ఆమెను బంధువులు గోరంట్ల ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. దీనిపై సీఐ శేఖర్‌ను అడగ్గా.. తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

● ఉరవకొండ పట్టణంలోని కొలిమి లే అవుట్‌లో జయలక్ష్మి(47) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ధనుంజయతో కలిసి జయలక్ష్మి కొలిమి లేఅవుట్‌లో నివాసముంటున్నారు. రెండేళ్ల కిందట జయలక్ష్మి చిన్న కుమారుడు మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె మానసికంగా కుంగిపోయారు. దీనికి కుటుంబ సమస్యలు తోడవడంతో తీవ్రంగా మనస్తాపం చెందారు. ఈక్రమంలోనే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సీఐ మహానంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆత్మహత్యకు గల వివరాలను ఆరాతీశారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఫొటోగ్రాఫర్ దుర్మరణం


అశ్వత్థనారాయణ (ఫైల్)

హిందూపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరపల్లి క్రాస్ సమీపాన గురువారం ఉదయం వాకింగ్ చేస్తున్న ఫొటోగ్రాఫర్ అశ్వత్థనారాయణ (46)ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో ఆయన దుర్మరణం చెందాడు. హిందూపురం అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంతేబిదునూరుకు చెందిన అశ్వత్థనారాయణ చౌళూరులో ఎప్పటిలాగే వాకింగ్ చేస్తున్నాడు. దేవరపల్లి క్రాస్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య సుజాత అక్కడకు చేరుకుని బోరున విలపించింది. పోలీసులు ప్రమాదస్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అశ్వత్థనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడి మృతిపట్ల హిందూపురం ఫొటోగ్రాఫర్లు సంతాపం తెలిపారు.

భర్తను చంపిన భార్యకు జీవిత ఖైదు

అనంతపురం క్రైం, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): భర్తను హతమార్చిన భార్యకు జీవిత ఖైదు విధిస్తూ అనంతపురం అడిషనల్ ఏడీ సెషన్స్ కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. యల్లనూరు మండలం శింగవరం గ్రామానికి చెందిన బత్తిని సుమకుమారిని 17ఏళ్ల కిందట అనంతపురంలోని అశోక్‌నగర్‌కు చెందిన రాజేంద్రప్రసాద్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న విషయం తెలుసుకున్న భర్త ఆమెను మందలించాడు. దీంతో ఆమె భర్తను అడ్డు తొలగించాలనుకుంది. 2021 నవంబరు రెండో తేదీ రాత్రి 7 గంటల సమయంలో వారింట్లోనే భర్తను రోకలిబండతో కొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు అదే రోజు అప్పటి వన్‌టౌన్ సీఐ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం ఏడీ సెషన్స్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో న్యాయాధికారి హరిత 15మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో గురువారం ముద్దాయి బత్తిని సుమకుమారికి జీవిత ఖైదు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ కేసును పీపీ నాగరాజ బాబు ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

ముగ్గురు కర్ణాటకవాసులకు గాయాలు


లారీని ఢీకొన్న కారు

పెనుకొండరూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో కర్ణాటకకు చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం గురువారం రాత్రి జరిగింది. శిడ్లఘట్టకు చెందిన సిల్క్ వ్యాపారులు మహేష్, మధు, శ్రీనివాసులు కారులో ధర్మవరానికి వచ్చి స్వస్థలానికి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధితులను 108లో పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆర్బిటార్ పరీక్షలో హుస్సేన్‌ఖాన్ ఉత్తీర్ణత



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చెస్ సంస్థ నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆర్బిటార్(అంపైర్) పరీక్షలో జిల్లాకు చెందిన చెస్ కోచ్ హుస్సేన్‌ఖాన్ ఉత్తీర్ణత సాధించాడు. ఇటీవల జరిగిన 12వ ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఆన్‌లైన్ సెమినార్‌లో 23దేశాల నుంచి పాల్గొన్నారు. వారిలో మనదేశం నుంచి ఇద్దరు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. అందులో హుస్సేన్‌ఖాన్ ఉండటం గమనార్హం. దీంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే చెస్ పోటీలకు హుస్సేన్‌ఖాన్ ఆర్బిటార్‌గా వ్యవహరించే అవకాశం లభించింది.

రాష్ట్రంలో ఢిల్లీకి మించిన లిక్కర్ స్కాం

(5వ పేజీ తరువాయి)

ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 29 డిపోలు ఉన్నాయని, అనంతపురంలో 30వ గోడౌన్‌ను అత్యంత ఆధునికంగా నిర్మించామని తెలిపారు. గోదాము నుంచి వెళ్లే ప్రతి స్టాక్ వాహనాన్ని ట్రాక్ చేస్తున్నామని, పర్యవేక్షణ వ్యవస్థను తెచ్చామని అన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యాన్ని అరికట్టామని, తద్వారా రాష్ట్రంలో 30 నుంచి 40 శాతం అమ్మకాలు పెరిగాయని తెలిపారు. నవోదయం ద్వారా నాటుసారా, అక్రమమద్యం రవాణా లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా ప్రజల సౌకర్యార్థం ప్రత్యేకంగా మద్యం డిపోను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ డిపో 94 మద్యం షాపులు, బార్లకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. అనంతపురం జిల్లా టీడీపీకి కంచుకోట అని, అందుకే చంద్రాబాబు కియ పరిశ్రమ, పలు అనుబంధ పరిశ్రమలు, నాసిన్, బెల్ వంటి సంస్థలను ఇక్కడ ఏర్పాటు చేయించారని తెలిపారు. జిల్లాలో హార్టికల్చర్ అభివృద్ధిలో నడుస్తోందని అన్నారు.

రెవెన్యూ పెరిగింది..

కొత్త మద్యం పాలసీ ద్వారా ఆదాయం పెరిగిందని ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ అన్నారు. అధికారులు పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. 2016లో ఇక్కడ ఉన్న పాత సారా బాట్లింగ్ ప్లాంట్ కాలిపోయి రూ.9 కోట్ల దాకా నష్టం జరిగిందని, దానికి ఇన్సూరెన్స్ క్లెయిమ్ అయిందని తెలిపారు. అప్పట్లోనూ మంత్రిగా కొల్లు రవీంద్ర ఉన్నారని, ఆయన ఆదేశాల మేరకు జిల్లాకు వచ్చి కాలిపోయిన ప్లాంట్ పరిశీలించానని తెలిపారు. దాని స్థానంలో ప్రస్తుతం అధునాతన గోడౌన్‌ను నిర్మించామని తెలిపారు. ప్రస్తుతం కొంత భూ సమస్య ఉందని, త్వరగా పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని కోరారు. సుమారు 27 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గోడౌన్‌ను నిర్మించామని ఏపీఎస్‌బీసీ లిమిటెడ్ ఎండీ నిశాంత్ కుమార్ తెలిపారు. హమాలీలు పనిచేసేందుకు గోడౌన్ సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు.

ఇంకో రూ.5 కోట్లు ఇవ్వండి: పరిటాల సునీత

2016లో ఈ గోడౌన్ కాలిపోయిందని, అప్పట్లోనూ మంత్రిగా ఉన్న కొల్లు రవీంద్రను నూతన గోడౌన్ నిర్మించాలని కోరామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అందుకు రూ.11 కోట్లు అప్పట్లోనే మంజూరు చేశారని తెలిపారు. వారి చేతుల మీదుగానే ఈ గోడౌన్‌ను ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. హమాలీల సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి, అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. కోర్టులో ఉన్న భూ సమస్యను అధికారులు, తాము కలసి పరిష్కరిస్తామని అన్నారు. మరో రూ.5 కోట్లు నిధులు మంజూరు చేస్తే పూర్తిస్థాయి గోడౌన్ తయారవుతుందని అన్నారు. అనంతరం హమాలీలకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. గోడౌన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, కొల్లకుంట అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.


లిక్కర్ గోదాములో పనిచేస్తున్న హమాలీలతో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణి శ్రీ

సమస్యలు పరిష్కరించండి

మంత్రికి ఎక్సైజ్ కానిస్టేబుళ్ల సంఘం నేతల వినతి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల సంక్షేమ సంఘం నేతలు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లాకు వచ్చిన మంత్రికి వినతి పత్రం సమర్పించారు. ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ల హెడ్ కానిస్టేబుల్ క్యాడర్ వారికి మాత్రమే ఉద్యోగోన్నతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందేందుకు 25 ఏళ్లు పడుతోందన్నారు. హెడ్ కానిస్టేబుల్ నుంచి ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందేలోగా అనేకమంది రిటైరవుతున్నారన్నారు. రెగ్యులర్, అడ్‌హాక్ ఉద్యోగోన్నతుల్లో హెడ్ కానిస్టేబుళ్లకు అన్ని జోన్లలో 40 శాతం ప్రాతినిధ్యం కల్పించి, న్యాయం చేయాలని కోరారు. సరండర్ లీవ్ శాలరీలను వర్తింపజేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్, ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, కోశాధికారి సునీత, నాయకులు రమేష్‌రెడ్డి, బాబ్జీ శామ్యూల్, కల్యాణి, కృష్ణానాయక్ పాల్గొన్నారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుళ్ల సంక్షేమ సంఘం నేతలు

కానిస్టేబుల్ భార్య మెడలో గొలుసు చోరీ

పోలీసుల అదుపులో చైన్‌స్నాచర్

వరుసగా మూడు ఘటనలు

అనంతపురం క్రైం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): గొలుసు దొంగలు రెచ్చిపోతున్నారు. ఈసారి ఓ దొంగ.. ఏకంగా పోలీసు కానిస్టేబుల్ భార్య మెడలోని బంగారు గొలుసునే తస్కరించాడు. నగరంలోని మూడో రోడ్డుకు చెందిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ భార్య దేవి బుధవారం మధ్యాహ్నం సమయంలో రాప్తాడుకు స్కూటీలో బయలుదేరింది. నగర శివారులోని హార్మోన్ సిటీ సమీపంలో ఓ దొంగ అటకాయించి, ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసు తస్కరించాడు. దీనిపై రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 7వ తేదీన తపోవనం సమీపంలోని ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రావణి.. తల్లితో కలిసి స్కూటీలో వెళ్తుండగా దొంగ బైక్‌లో వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కున్నాడు. వారం రోజుల క్రితం త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ మహిళ నడిచి వెళ్తుండగా దొంగ ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ఆమె అడ్డుకోవడంతో అతడి చేతిలోకి ఒకటిన్నర తులం బంగారు వెళ్లింది. వరుసగా మూడు చైన్‌స్నాచింగ్‌లు జరగడంతో ఎస్పీ జగదీష్ సీరియస్‌గా తీసుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి నిఘా ఉంచారు. ఈ క్రమంలో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముండే ఓ దొంగను పట్టుకున్నట్లు సమాచారం. ఈ మూడు చైన్ స్నాచింగ్‌లు అతడే చేసినట్లు విచారణలో చెప్పినట్లు తెలిసింది.

కొడికొండ చెక్‌పోస్టులో..

చిలమత్తూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో చిల్లర దుకాణం నడుపుకుంటున్న ఓ మహిళ మెడలో ఉన్న 3.5 తులాల బంగారు గొలుసుని గుర్తు తెలియని ఆగంతకులు గురువారం లాక్కెళ్లారు. బాధితురాలు ఇంద్రమ్మ తెలిపిన మేరకు.. తను చిల్లర కొట్టులో ఉండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి కూల్ డ్రింక్ అడిగారన్నారు. వారికి కూల్ డ్రింక్ అందించేందుకు పక్కకు వంగడంతో ఒక వ్యక్తి వచ్చి బలవంతంగా మెడలో ఉన్న బంగారు మాంగళ్యం గొలుసును లాగాడన్నారు. ప్రతిఘటించినా గట్టిగా లాగడంతో గొలుసు తెగిపోయిందన్నారు. ఈక్రమంలో తన మెడపై గాయమైందని తెలిపారు. వెంటనే బయటికి వచ్చి కేకలు వేయగా దుండగులు ద్విచక్రవాహనంలో పారిపోయారన్నారు. దుండగులు మొహానికి కర్చీఫ్ కట్టుకొని వచ్చినట్లు తెలిపారు. ఎస్ఐ మున్నీర్ అహమ్మద్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని బాధితురాలితో వివరాలు ఆరాతీశారు. దగ్గర్లో ఉన్న సీసీ కెమేరాల పుటేజీని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడాదిలో రెండోసారి

బాధితురాలు ఇంద్రమ్మ పైసాపైసా కూడబెట్టి తెచ్చుకున్న బంగారం ఒకే ఏడాదిలో రెండుసార్లు దొంగల పాలైంది. చిల్లర కొట్టు నిర్వహణతోనే జీవనం సాగిస్తూ పొదుపు చేసుకుని కొనుక్కున్న బంగారాన్ని దుండగులు దోచేశారని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. గతేడాది ఇదే కొట్టులో ఉండగా ఒక వ్యక్తి వచ్చి వాటర్ బాటిల్ అడిగాడు. అంతలోనే చాకచక్యంగా మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ఆ సమయంలో ఆమె ఏదో శుభకార్యానికి వెళ్లి వచ్చి మెడలో బంగారు గొలుసులని అలాగే ఉంచుకుంది. దాంతో 8 తులాలు బంగారు గొలుసులు లాక్కెళ్లారు. రెండు నెలల తర్వాత చోరీ చేసిన దుండగుడు బాగేపల్లి పోలీసులకు చిక్కాడు. వారి విచారణలో కొడికొండ చెక్‌పోస్టులో బంగారు గొలుసు దొంగిలించినట్లు ఒప్పుకుని సొత్తుని పోలీసులకు అప్పగించాడు. ఆ సొత్తు ఇప్పటికీ ఆమెకు ఇవ్వలేదు. కర్ణాటక పోలీసుల వద్దే ఉంది.

తల్లీబిడ్డను కాపాడుకుందాం

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం


మాట్లాడుతున్న డాక్టర్ ఫైరోజ్‌బేగం

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలిద్దాం, లోపాలను సరి చేసుకుని సమష్టిగా పనిచేసి తల్లీబిడ్డను కాపాడుకుందామని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఫైరోజ్‌బేగం పేర్కొన్నారు. స్థానిక జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో గురువారం మాతాశిశుమరణాలపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ ఆసుపత్రులలో సంభవించిన మాతాశిశుమరణాలపై చర్చించారు. ఈసందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతినెల 9వ తేదీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో గర్భవతులకు గ్రూపు సమావేశం నిర్వహించి, వారికి ఆరోగ్యవిద్య అందించాలన్నారు. హైరిస్క్ గర్భిణుల కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని, కాన్పు అయ్యేంత వరకు వారిపై ప్రత్యేక దృష్టి ఉంచాలని సూచించారు. ఏ బిడ్డా జన్మిస్తూ మరణించకూడదు. ఏతల్లి జన్మనిస్తూ మరణించకూడదని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. కార్య క్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ నాగేంద్రనాయక్, డాక్టర్ సునీల్, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, జిల్లా ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్లు డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ నీరజ, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ కార్తీక్, ఐసీడీఎస్ పీడీ శారద, డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ, జిల్లాలోని సంబంధిత పీహెచ్‌సీ వైద్యాధికారులు సూపర్‌వైజర్లు ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవద్దు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ధైర్యాన్ని కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోకూడదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సివిల్ న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ సూచించారు. గురువారం స్థానిక గిల్డ్ ఆఫ్ సర్వీస్ గర్ల్స్ హాస్టల్, ఎస్సీ, బీసీ వసతిగృహాలను న్యాయాధికారి సందర్శించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. చదువు, పరీక్షల వంటి సమస్యల నేపథ్యంలో పోటీతత్వాన్ని ఎదుర్కోవాలన్నారు. చదువుపై ఆందోళన చెంది, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోరాదన్నారు. మానసిక ఒత్తిడికి లోనై తెలిసీతెలియని వయసులో ఆత్మహత్యలవైపు పయనించడం సరికాదన్నారు. విద్యార్థులు ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే తల్లిదండ్రులు జీవితాంతం తీరని మనోవేదనకు లోనవుతారన్నారు. తల్లిదండ్రుల గురించి ఆలోచించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు, అధ్యాపకులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ. 23వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.23,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4,150, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 1363 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షం కురిసింది. కూడేరు, పుట్లూరు, కణేకల్లు మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. గార్లదిన్నె, బెలుగుప్ప, తాడిపత్రి, డి. హిరేహాళ్, రాయదుర్గం తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

వైసీపీ అరాచకాల లెక్క తీయాల్సిందే..!

ఎమ్మెల్సీకి ఎస్కేయూ వర్గాల ఫిర్యాదు


ఎమ్మెల్సీకి అరాచకాలను వివరిస్తున్న ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఎస్కేయూ ఉద్యోగులు, విద్యార్థులపై సాగించిన అరాచకాల లెక్క తీయాల్సిందేనని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని వర్సిటీ వర్గాలు కోరాయి. గురువారం ఎస్కేయూకి వచ్చిన ఎమ్మెల్సీ.. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబును కలిశారు. పలువురు ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు.. ఎమ్మెల్సీని కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. బోధనేతర ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగులపై కక్షగట్టిన మాజీ వీసీ రామకృష్ణారెడ్డి అనేకమందిని అకారణంగా సస్పెండ్ చేశారన్నారు. వారిని ఆర్థికంగా, మానసికంగా కుంగదీయడమే కాకుండా ఒక ఉద్యోగిని బలి తీసుకున్నారన్నారు. రివర్స్ ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు కటింగ్, బదిలీలతో వేధించారన్నారు. రెండు దశాబ్దాలుగా వర్సిటీలో విధులు నిర్వహిస్తున్న దాదాపు 25 మంది మరణిస్తే బాధిత కుటుంబాలకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు కల్పించలేదని వాపోయారు. ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన మాట్లాడుతూ.. 203 జీఓను అతిక్రమించి రెగ్యులరైజేషన్, ప్రమోషన్లు కల్పించారన్నారు. అభివృద్ధి పేరుతో వర్సిటీ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. దాదాపు 4వేల మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించకుండా భవిష్యత్తును నాశనం చేశారని మండిపడ్డారు. వాటన్నింటిపై విచారణ చేపట్టేందుకు కమిటీని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, బాధితులందరికీ న్యాయం చేసేందుకు కృషి చేస్తామని భరోసానిచ్చారు. అనంతరం ఆయనను అసోసియేషన్ అధ్యక్షుడు తిమ్మప్ప, నేతలు నాగముణి, మారుతి, లక్ష్మీనరసింహులు, గోవిందరాజులు, ఇలియాజ్, ఉమాపతి ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి సామాజిక చైతన్య యాత్ర

ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి


వివరాలు వెల్లడిస్తున్న సావిత్రి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్మరించుకుంటూ శుక్రవారం నుంచి ఈనెల 14వతేదీ వరకు జిల్లా వ్యాప్తంగా సామాజిక చైతన్యయాత్ర చేపట్టనున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి పేర్కొన్నారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జడ్పీ హాల్ నుంచి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 14న సాయంత్రం 5 గంటలకు అంబేడ్కర్ నగర్ నాగులకట్ట హైస్కూల్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, వెంకటేష్, జీవ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, గిరి, గర్ల్స్ కమిటీ కన్వీనర్ రజిత, ఐద్వా జిల్లా నేతలు చంద్రిక, అశ్విని పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్ల ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

అనంతపురం విద్య/కొత్తచెరువు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యా ఏడాదికి ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష తేదీ మార్పు చేసినట్లు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాధికారులు ప్రసాద్‌బాబు, కిష్టప్ప గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20న నిర్వహించాల్సిన పరీక్షను ఈస్టర్ పర్వదినం కారణంగా 21వ తేదీకి మార్చినట్లు తెలిపారు. మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు ఈ విషయాన్ని విద్యార్థులకు చేరవేయాలన్నారు. ఈనెల 21వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లను www.cse.ap.gov.in, www.ap ms.apcfss.in వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పోలీసు పిల్లలకు గుణాత్మక విద్యే లక్ష్యం: ఎస్పీ

అనంతపురం క్రైం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): పోలీసు పిల్లలకు మెరుగైన సౌకర్యాలతో పాటు గుణాత్మక విద్య అందించడమే లక్ష్యమని ఎస్పీ జగదీష్ అన్నారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం పోలీసు రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూల్ మూడో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై, మాట్లాడారు. పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగ్గా ఇక్కడ నిర్వహిస్తున్నారన్నారు. చదువులతోపాటు పిల్లలకు ఆటలు ముఖ్యమన్నారు. పిల్లలకు పెన్సిళ్లు, క్రెయాన్స్‌తోపాటు ప్రతి పోలీసు స్టేషన్‌లో 15 హెల్మెట్ల ఏర్పాటుకు డిస్కవరీ సంస్థ నిర్వాహకుడు అనిల్‌కుమార్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు డీవీ రమణమూర్తి, ఇలియాజ్ బాషా (ఏఆర్), డీఎస్పీలు వెంకటేశులు, రవిబాబు, శ్రీనివాస్, నీలకంఠేశ్వర్‌రెడ్డి (ఏఆర్), సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, దేవానంద్, ఆర్ఐలు పవన్‌కుమార్, మధు, రాముడు, పోలీస్ అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, హరినాథ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


పిల్లలకు విద్యాసామగ్రి అందజేస్తున్న ఎస్పీ జగదీష్

న్యూస్ బాక్స్

ఎమ్మెల్యే దగ్గుపాటి నివాసంలో మంత్రికి అల్పాహార విందు



ఎమ్మెల్యే నివాసంలో అల్పాహార విందు చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ నివాసంలో గురువారం ఉదయం ఎక్సైజ్ శాఖమంత్రి కొల్లు రవీంద్ర పలువురు ముఖ్యనాయకులతో కలిసి అల్పాహార విందు చేశారు. ఈ సందర్భంగా మంత్రికి గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ విందులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బండారు శ్రావణి శ్రీ, ఎంఎస్ రాజు, నాయకులు గౌస్‌మొయిద్దీన్, గంగారామ్, తలారి ఆదినారాయణ, కూచి హరి తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడితే నష్టాలే

● భూసార పరీక్ష కేంద్రం అధికారి

గార్లదిన్నె, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో ఎరువులు, హానికారక రసాయనాలు మోతాదుకు మించి వినియోగిస్తే నష్టాలు చవిచూడాల్సిందేనని భూసార పరీక్ష కేంద్రం అధికారి శ్రీనాథ్‌రెడ్డి రైతులకు సూచించారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో గురువారం ఎరువులు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఏఈఓ స్రవంతి, విహెచ్‌ఏ గుల్బరేషా, ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఎస్కేయూ సర్టిఫికెట్‌కు ప్రత్యేక గుర్తింపు : ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల మంజూరుచేసే బీటెక్, ఎంటెక్ డిగ్రీ సర్టిఫికెట్లకు ప్రత్యేక గుర్తింపు ఉందని. దీంతో విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మెరుగైన అవకాశాలు వస్తున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర పేర్కొన్నారు. ఆయన గురువారం కళాశాల విభాగాధిపతులతో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈనెల 29న కళాశాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు లత, విజయకుమార్, లింగమయ్య, హేమంత్, రాజేష్, ఆంజనేయులు, ప్రదీప్, తిమ్మప్ప, అసిస్టెంట్ రిజిస్ట్రార్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపు గంధం ఉత్సవం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని చియ్యేడు గ్రామంలో వెలసిన హజరత్ షేక్ ఇమామ్ షావలి దర్గా ఉరుసు ఉత్సవాలను శని, ఆదివారాల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా మేనేజర్ హజరత్ షేక్ హాజీ గఫూర్ సాహెబ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 12న గంధం పూజ, 13న ఉరుసు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎరా స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులతో ముఖ్య అతిథులు

అనంతపురం రూరల్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిమి సమీపంలో ఉన్నఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విద్యాసంస్థల అధినేత చిరంజీవిరెడ్డి, తెలంగాణకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ వినూత్నరెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి హాజరయ్యారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గాయపడిన ఓ మహిళ కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి సమీపంలోని ప్రజాశక్తినగర్‌లో నివాసముంటున్న ఓబుళమ్మ (50)ఈనెల 3వ తేదీన వర్షం పడిన సమయంలో సన్‌షేడ్ ముందు భాగం కూలి గాయాలకు గురైంది. ఆమెను కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శింగనమల క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. అనంతపురం రూరల్ మండలం మన్నీలకు చెందిన శ్రీరాములు, శంకరయ్య ద్విచక్ర వాహనంలో శింగనమలకు వెళుతున్నారు. అదేవైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో శ్రీరాములు, శంకరయ్యకు గాయాలయ్యాయి. వారిని 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పిడుగుపాటుకు గొర్రెలు.. మేకల మృతి



గొర్రెలు, మేకల కళేబరాలు

గార్లదిన్నె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెనకచెర్ల గ్రామంలో గురువారం సాయంత్రం పిడుగుపడి తొమ్మిది గొర్రెలు, రెండు మేకలు మృతి చెందాయి. పెనకచెర్లకు చెందిన చితంబరప్ప అనే కాపరి రోజూ మాదిరిగానే ఉదయం గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. సాయంత్రం మెరుపులతో కూడిన వర్షం వస్తుండడంతో త్వరగా ఇంటికి చేరుకోవాలని గొర్రెలను తోలుకుని ఇంటికి బయలుదేరాడు. గ్రామ సమీపంలోకి రాగానే వర్షం ఎక్కువ అవడంతో గొర్రెలను నిలుపుకొని అక్కడే ఉన్న గదిలో నిల్చున్నాడు. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో బయటకు వచ్చాడు. అప్పటికే తొమ్మిది గొర్రెలు, రెండు మేకలు మృతి చెందినట్లు గుర్తించాడు. దీంతో సుమారు రూ.1.50వేలు నష్టం వాటిల్లిందని గొర్రెల కాపరి చితంబరప్ప కన్నీరుమున్నీరయ్యాడు. చితంబరప్పను ఆదుకోవాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు.

ముంటిమడుగు ఆర్థిక సాయం: పిడుగు పాటుకు గొర్రెలు, మేకలు మృతి చెందిన విషయం తెలుసుకున్న శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి గొర్రెల కాపరి చితంబరయ్యను ఫోన్ ద్వారా పరామర్శించాడు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం టీడీపీ స్థానిక నాయకుల ద్వారా రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశా రు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, చితంబరప్ప, చితంబరి, మల్లికార్జున, గోవిందు తదితరులు పాల్గొన్నారు.







మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు, బండారు శ్రావణి శ్రీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే పరిటాల సునీత

మంత్రి కొల్లుకు ఘన స్వాగతం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు ఘనంగా స్వాగతం పలికారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అలాగే టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దగ్గుపాటి నివాసంలో మంత్రి కొల్లు రవీంద్రను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర నా యకులు తలారి ఆదినారాయణ, ఆలం నరసానాయుడు, నాయకులు సింగ వరం రవి, పాముురాయి వెంకటేష్, రాయల్ మురళి, గుర్రం నాగభూషణం, బెస్తసాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ చేపల హరి, బెస్త సంఘం నాయకులు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.





మంత్రికి స్వాగతం పలుకుతున్న సింగవరం రవి, రాయల్ మురళి, చేపల హరి, బెస్త సంఘం నాయకులు

నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వండి

● మంత్రి కొల్లును కోరిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయిచాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రకు విన్నవించారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి గురువారం నగరంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. ఆయన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. ఎస్సీ నియోజకవర్గం శింగనమల అభివృద్ధికి తమ వంతుగా నిధులు కేటాయించి అభివృద్ధికి సహకారం అందజేయాలని ఎమ్మెల్యే మంత్రికి విన్నవించారు. అంతకుమునుపు నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఐఎంఎఫ్ఎల్ డిపో ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతో పాటు మంత్రిని కలిశారు. తెలుగు యవత రాష్ట్ర మాజీ కార్యదర్శి మాసూల చంద్రమోహన్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బీసీ నాగేంద్ర, పెద్దమట్లగొంది సర్పంచ్ గాండ్ల రమేష్ మంత్రిని కలిసి స్వాగతం పలికారు.

మంత్రిని కలిసిన పలువురు నాయకులు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాముురాయి రఘు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోములదొడ్డి గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన ఐఎంఎఫ్ఎల్‌డిపో గోడౌన్ ప్రారంభోత్సవానికి హాజరైన ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మండల ప్రధాన కార్యదర్శి పాముురాయి రఘు కలిశారు. ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలసి వెళ్లి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. డిపోలోని హమాలీల సమస్యలు పరిష్కరించి, వారికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

● అనంతపురం అర్బన్: వడ్డెర్లకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను వడ్డెర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్ కోరారు. ఈ మేరకు గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. వడ్డెర్లకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. జిల్లా కేంద్రంలో వడ్డెర్లకు కల్యాణ మండపానికి స్థలం కేటాయించి, తగిన వసతులను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర్ల సంఘం నాయకులు సుధాకర్, మంజు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం సెంట్రల్: మద్యం షాపుల నిర్వహణలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ అవకాశాన్ని కల్పించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్త మద్యం టెండర్లలో కల్లుగీత కార్మికులకు అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. అదే తరహాలో ఎస్సీ, ఎస్టీలకు 15శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. నాయకులు రామకృష్ణ, నారాయణస్వామి, సూర్యనారాయణ, వెంకటేశులు, కదిరప్ప, గోవిందు, సాగర్, నాగేంద్ర, సురేష్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

పీటీసీ డీఎస్పీగా వాసుదేవన్

అనంతపురం క్రైం,ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ శిక్షణా కళాశాల(పీటీసీ) డీఎస్పీగా వాసుదేవన్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కడప జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న వాసువేదన్‌ను పీటీసీలో ఖాళీగా ఉన్న డీఎస్పీ పోస్టుకు నియమించారు. కాగా పీటీసీలో మూడు డీఎస్పీ పోస్టులుంటాయి.

చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి : సీపీఐ

గార్లదిన్నె, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మర్తాడు గ్రామంలో చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి నారాయణ స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ స్థానకి కార్యాలయంలో గురువారం ఆ పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. అప్పట్లో యువగళం పాదయాత్ర 800 మైలురాయి ఏర్పాటు చేసిన సందర్భంగా ఇచ్చిన హామీపై మంత్రి నారా లోకేష్ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. మర్తాడులో చీని ప్రాసెసింగ్ యూనిట్‌ను తర్వగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నియోజకవర్గం నాయకుడు రామాంజి, సీపీఐ నాయకులు శ్రీనాథ్‌చౌదరి, వన్నూర్ స్వామి, రామకృష్ణ, అంజినమ్మ, ఎండీ రాముడు, జగన్నాథ్, శివయ్య, రామచంద్ర ఆచారీ తదితరులు పాల్గొన్నారు.

సెలవులో అర్బన్ తహసీల్దార్

● ఇన్‌చార్జ్ బాధ్యతలు మరొకరికి ఇవ్వని వైనం

● 4 రోజులుగా ఆన్‌లైన్‌లో మూలుగుతున్న సర్టిఫికెట్లు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్యజ్యోతి): అర్బన్ తహసీల్దార్ సెలవులో వెళ్లారు. ఆయన ఈ నెల 7వ తేదీ నుంచి ఈ నెల 21 వరకు వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవుపెట్టారు. నాలుగు రోజులు గడుస్తోంది. గురువారం సాయంత్రం కూడా మరో అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించలేదు. రూరల్ మండలం తహసీల్దార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించేందుకు కార్యాలయం అధికారులు ఫైల్‌ను జిల్లా అధికారులకు పంపినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఇన్‌చార్జ్ నియమానికి సంబంధించిన ఫైల్‌పై సంతకం లేదని ఆయా వర్గాల సమాచారం. ఇన్‌చార్జ్ బాధ్యతలు మరో అధికారికి అప్పగించకపోవడంతో క్షేత్రస్థాయిలో ప్రజలకు సర్టిఫికెట్లు జారీలో జాప్యం నెలకొంది. సాధారణంగానే అర్బన్ పరిధిలో రోజుకు వందల సంఖ్యలో పలు సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని కార్యాలయాని వస్తుంటారు. నాలుగురోజులుగా వాటిని సర్టిఫైచేసే అధికారులు లేకపోవడంతో ఆ సర్టిఫికెట్లన్నీ ఆన్‌లైన్‌లోనే మూలుగుతున్నాయి.

జనవాణి కార్యక్రమంలో టీసీ వరుణ్



జనవాణి కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న టీసీ వరుణ్, జనసేన నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో అహుడా చైర్మన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ పాల్గొన్నారు. జనవాణి కార్యక్రమంలో ఆ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు వినతులు స్వీకరిస్తున్న విదితమే. అందులో భాగంగానే గురువారం టీసీ వరుణ్‌ను జనవాణిలో పాల్గొనాలని సూచించారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఆ పార్టీ నాయకులతో కలిసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని రాష్ట్రనాయకులకు పంపినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, వీర మహిళలు కసిరెడ్డి మధులత, లీగల్‌సెల్ ప్రతినిధి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైనికపురంలో వసతులు కల్పించండి

కెప్టెన్ షేకన్న

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కూడేరు మండలం గొట్కూరు పంచాయతీ లోని సైనికపురంలో మౌలిక వసతులు కల్పించాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న జిల్లా అధికారులను కోరారు. ఆ సంఘం కార్యాలయంలో గురువారం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షేకన్న మాట్లాడుతూ... సైనికపురంలో ఆర్నెల్ల క్రితం 1500 మొక్కలు నాటామని, డ్వామా ఆధ్వర్యంలో వాచ్ అండ్ వార్డ్ ఏర్పాటు చేశామన్నారు. అయితే కూలీలకు సరైన సమయంలో జీతాలు అందకపోవడంతో మొక్కలకు నీరందించేవారు కరువయ్యారని పేర్కొన్నారు. కూడేరు ఏపీఈ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు వీకే రంగారెడ్డి, కోశాధికారి తిమ్మారెడ్డి, కార్యవర్గ సభ్యులు నాగిరెడ్డి, రంగారెడ్డి, బషీర్ అహ్మద్, హుస్సేన్ బాషతదితరులు పాల్గొన్నారు.

కుల రాజకీయాలు చేయొద్దు ప్రకాష్‌రెడ్డీ..

టీడీపీ నాయకులు

రాప్తాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డిపల్లి లింగమయ్య హత్యపై కుల రాజకీయం చేయెద్దని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని, లాయర్ నాగన్నను టీడీపీ నియోజకవర్గ టీడీపీ కురుబ నాయకులు తీవ్రంగా హెచ్చరించారు. వారు గురువారం టీడీపీ స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహిచి మాట్లాడారు. మాజీ సీఎం జగన్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, లాయర్ నాగన్న శవ రాజకీయాలు చేస్తున్నారన్నారు. లింగమయ్య హత్య అనుకోకుండా జరిగిందన్నారు. లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన జగన్ వారికి ఒక్క రూపాయి అయినా ఆర్థిక సహాయం చేశాడా అని ప్రశ్నించారు. పోలీసుల గుడ్డలూడదీస్తామని జగన్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. లింగమయ్య హత్యను పరిటాల కుటుంబంపై మోపడం మానుకోవాలన్నారు. టీడీపీ రాప్తాడు, రామగిరి మండల కన్వీనర్లు కొండప్ప, సుధాకర్, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, బీసీ సెల్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కిష్ట, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బీరన్న, కురుబ సాధికార సమితి డైరెక్టర్ రాగే మురళి, అడ్డ తిరుపాలు, డీలర్ల నరేంద్ర, గంగాధర్ పాల్గొన్నారు.

ఎస్ఐ సుధాకర్‌కు అండగా ఉంటాం

● యాదవ సంఘం నాయకులు



మాట్లాడుతున్న యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి యాదవ్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్‌పై వైసీపీ చేస్తున్న కుట్ర పూరిత రాజకీయాలను తిప్పి కొట్టడంతో పాటు ఆయనకు అండగా ఉంటామని యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో నక్కా రామారావు యాదవ భవన్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన ఎస్ఐ సుధాకర్ నిబద్ధతతో విధులు నిర్వహిస్తుంటే, ఆయనపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో వైసీపీ ఏర్పడినప్పటినుంచి భాష సంస్కృతి మారిపోయిందని, ఆ పార్టీ శ్రేణులు వీధిరౌడీల్లా మాట్లాడుతున్నారని విమర్శించారు. వైసీపీ పాలనలో హత్యలు, అత్యాచారాలను ప్రేరేపిస్తే వాటిని అరికట్టేందుకు ప్రస్తుత పాలకులు కృషి చేస్తున్నారన్నారు. రామగిరి మండలంలో జరిగిన వర్గ హత్యను రాజకీయ పార్టీలకు ఆపాదించేందుకు మాజీ ఎమ్మెల్యే యత్నించడం సబబు కాదన్నారు. ఇదంతా రాజకీయ లబ్ధికోసం వైసీపీ చేస్తున్న కుట్ర అన్నారు. ఎమ్మెల్సీ అనంత బాబు డ్రైవర్‌ను హత్యచేసి డోర్ డెలివరీ చేస్తే జగన్ ఆ డ్రైవర్ కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. యాదవ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పరంధామ మాట్లాడుతూ... బీసీ అయిన లాయర్ నాగన్న ఎస్ఐ సుధాకర్‌పై చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు. వైసీపీ హ యాంలో కురుబ ఎమ్మెల్యే శంకర్‌నారాయణపై చెప్పులు వేసినప్పుడు లాయర్ నాగన్న ఎందుకు మాట్లాడలేదన్నారు. పదేళ్లపాటు ఎస్ఐగా పనిచేస్తున్న సుధాకర్ యాదవ్ రూ. 3 లక్షల కారు కొనుక్కోకూడదా..? అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య యాదవ సంఘం జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు రామకృష్ణ యాదవ్, టీడీపీ పెనుగొండ అధ్యక్షుడు శ్రీరాములు యాదవ్, యువజన రాష్ట్ర నాయకుడు జైపాల్ యాదవ్, విద్యార్థి నాయకులు సురేష్ యాదవ్, నరసింహులు యాదవ్, ఆంజనేయులు, రాజు, బిల్లా వెంకటేష్, రమేష్, రామ్మూర్తి యాదవ్ పాల్గొన్నారు.

జగదభిరాముడికి గరుడవాహన సేవ



స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజున గురువారం రాములవారు గరుడవాహనంపై ఊరేగుతూ దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సీతారాముల మూలవిరాట్లకు వివిధ అభిషేకాలు, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని వెంకటేశ్వరస్వామిగా అలంకరించి ప్రత్యేక రథంలోని గరుడవాహనంపై ఆశీనులను చేసి ఊరేగించారు. రాత్రికి స్వామివార్ల కు దశహారతులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభ, భక్తమండలి నరేంద్ర చౌదరి, శ్రీనివాసులు చౌదరి, జిజే వేణు, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

శింగనమల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఒంటిమెట్ల తరహాలో శుక్రవారం శింగనమలలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ప్రసిద్ధి చెందిన శింగనమల ఆత్మసీతారామ స్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం శ్రీరామినవమి తరువాత వచ్చే పౌర్ణమి రోజు సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. ఈ సంద ర్భంగా కల్యాణ మండపాన్ని ముస్తాబు చేశారు. శుక్రవారం రాత్రి 8.30 గంటకు తులాలగ్నంలో స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కుటుంబ సభ్యులు సీతారాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేస్తారని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

పూలే జయంతిని జయప్రదం చేయండి

బీసీ సంక్షేమశాఖ డీడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ గురువారం ప్రకటనలో కోరారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు జిల్లా పరిషత్ ఆవరణంలోని జ్యోతిబాపూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తామన్నారు. అనంతరం 10 గంటలకు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, కలెక్టర్ వినోద్‌కుమార్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. కావున జిల్లాలోని ప్రజలు, బీసీ సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు బీసీ సబ్సిడీ రుణాల మెగా చెక్కు విడుదల : ఈడీ

రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన సబ్సిడీ రుణాల మెగా చెక్కును శుక్రవారం విడుదల చేస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. జిల్లాలో 477 మంది లబ్ధిదారుల సబ్సిడీ రుణాలకు సంబంధించి రూ.11.61 కోట్లు నిధులు విడుదలయ్యాయని తెలిపారు. జ్యోతిబాపూలే జయంతి వేడుకల సందర్భంగా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా రూ. 11.61 కోట్ల మెగా చెక్కును విడుదల చేయనున్నట్లు తెలిపారు.

రోగులకు నాణ్యమైన భోజనం అందించాలి

● సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఆదేశం



డైట్ క్యాంటిన్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో రోగులకు అందించే ఆహారం నిబంధనల మేరకు నాణ్యంగా ఉండాల్సిందేనని సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఆస్పత్రిలోని డైట్ క్యాంటిన్, తల్లి పాల డెయిరీ, బర్న్‌వార్డు, ఈఎన్‌టీ, తదితర విభాగాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందించేందుకు క్యాంటిన్‌లో తయారుచేసిన భోజనం నాణ్యత, రుచిని పరిశీలించారు. అక్కడే ఉన్న సరకులు, కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లను పరిశీలించారు. రోగులకు మెనూ మేరకు అల్పాహారం, భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తల్లిపాల డెయిరీని, బర్న్‌వార్డు, ఈఎన్‌టీ విభాగాలను పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది డ్యూటీ సమయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఎంఓ డాక్టరు రామక్రిష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టరు హేమలత, డాక్టరు పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పాతూరు సీడీ ఆస్పత్రిలోకి డీసీహెచ్‌ఎస్ ఆఫీస్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): డీసీహెచ్‌ఎస్ ఆఫీస్ తరలింపు వివాదానికి తెరపడింది. తమకు భవనాల కొరత ఉందని, జిల్లా ఆస్పత్రి ఆవరణంలో ఉన్న డీసీహెచ్‌ఎస్ కార్యాలయాన్ని ఖాళీచేయించాలని జీజీహెచ్ వైద్యాధికారులు దాదాపు మూడేళ్లుగా ప్రయత్నిస్తున్నారు. అయితే ఇటీవల ప్రస్తుత కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఈ విషయంలో సీరియస్‌గా తీసుకుని ఆదేశించినా, వారు దాదాపు ఆర్నెల్లుగా ఖాళీ చేయలేదు. ఎట్టకేలకు గురువారం ఖాళీచేసి పాతూరు సీడీ ఆస్పత్రిలోకి మార్చి వేశారు. దీంతో ఆ భవనాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు, చర్మవ్యాధి వైద్య విభాగం డాక్టర్లు పరిశీలించారు. అక్కడ చర్మవ్యాధి చికిత్సా విభాగం ఏర్పాటుచేస్తున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. ఇప్పటివరకు ఎయిడ్స్-హెచ్‌ఐవీ విభాగంలోనే చర్మవ్యాధి వార్డు ఉంటూ వస్తోంది. ఇప్పుడు ఆ విభాగానికి ప్రత్యేక వార్డు అందుబాటులోకి రానుంది.

కాశీయాత్రికులకు సన్మానం అదృష్టం: ఎమ్మెల్యే



కాశీ పాదయాత్రికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రామేశ్వరం నుండి కాశీ వరకు ఆధ్యాత్మిక పాదయాత్ర చేస్తున్న భక్తులను సన్మానించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. కాశీకి 120 రోజుల సుదీర్ఘ పాదయాత్ర చేపట్టిన తమిళనాడు భక్తులు ఇటీవల జిల్లాలోకి ప్రవేశించారు. అప్పటి నుంచి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వారికి అవసరమైన భోజనం, వసతి కల్పిస్తున్నారు. గురువారం ఈ బృందం నగరానికి చేరుకుని ఎమ్మెల్యేని కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతోపాటు ఆయన సతీమణి, బంధువులు, కార్యాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు యాత్రికులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, టీడీపీ నాయకులు సింగమనేని రామాంజనేయులు, బోయపాటి రామచంద్ర, దగ్గుపాటి రాజా, వెంకటపతి, లక్ష్మీ నారాయణ రెడ్డి, తెలుగు యువత సాకే లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

650 చీనీ మొక్కల పీకివేత

కూడేరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.నారాయణపురం గ్రామంలో రైతు సాయికృష్ణకు చెందిన చీనీతోటలో దాదాపు 650 చీనీ మొక్కలు పీకివేతకు గురయ్యాయి. ఐదు ఎకరాల పొలంలో రెండు నెలల క్రితం 755 చీనీ మొక్కలను నాటానని, దాదాపు రూ.మూడు లక్షల వరకు అప్పు చేసి మొక్కలు నాటానని, అయితే గురువారం మధ్యాహ్న సమయంలో మొక్కలకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లగా తొలగించబడిన చీనీమొక్కలు కనిపించాయని బాధిత రైతు వాపోయారు. దాదాపు 650 మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించినట్లు చెప్పారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చీనీ, దానిమ్మ చెట్లు దగ్ధం

ఉరవకొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమిద్యాల గ్రామంలో అమిలినేని సురేష్‌కు చెందిన తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఆ రైతు తన 20 ఎకరాల పొలంలో దానిమ్మ, చీనీ చెట్లు సాగు చేశారు. అయితే పొలానికి నిప్పుపెట్టడం గుర్తించిన కూలీలు మంటలు వ్యాపించకుండా ఆర్పివేశారు. అప్పటికే సుమారుగా వందకు పైగా దానిమ్మ, చీనీ చెట్లు కాలిపోయాయి. రూ.లక్షల వరకూ నష్టం వాటిలినట్లు రైతు వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలి


ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని టాటా కేపిటల్ ఫైనాన్స్ కార్యాలయం వద్ద గురువారం వారు ఫైనాన్స్ బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు గోపినాథ్, రాము మాట్లాడుతూ.. పట్టణంలో ఫైనాన్స్ కంపెనీలు, వడ్డీ వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోయాయన్నారు. వారం వడ్డీలు వసూలు చేసేందుకు రాత్రి 11గంటల సమయంలో ఇళ్ల వద్దకు వెళ్లి మహిళలను అవమానకరంగా మాట్లాడుతున్నారన్నారు. ఫైనాన్స్ కంపెనీల వేధింపుల విషయంలో బాధితులకు పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దాసరి శ్రీనివాసులు, సూర్యనారాయణ, బాలకృష్ణ, ఆటోశివ తదితరులు పాల్గొన్నారు.

మాధవ్.. నోరు అదుపులో పెట్టుకో: టీడీపీ

పుట్లూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని టీడీపీ మండల ఎస్సీ సెల్ నాయకుడు రామాంజనేయులు గురువారం ప్రకటనలో హెచ్చరించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురించి మాట్లాడే అర్హత మాధవ్‌కు లేదన్నారు. మరోసారి లోకేష్‌ను కించపరిచేలా మాట్లాడితే సహించమన్నారు. ఇప్పటికైనా ఇలాంటి వ్యాఖ్యలు మానాలని హితవు పలికారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

పుట్లూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గురువారం స్థానికుడైన వెంకటపతి మనవడు గోవర్దన్‌వంశీ స్కూల్ బ్యాగులు, యూనిఫాం పంపిణీ చేశారు. సుమారు 60మంది విద్యార్థులకు అందజేశారు. స్కూల్ కమిటీ ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు..

.ఉరవకొండ ,ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు గురువారం పాఠ్యపుస్తకాలను కళాశాల ప్రిన్సిపాల్ మమత అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ఏప్రిల్ నెలలోనే ప్రారంభమయ్యాన్నారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు బ్రిడ్జ్ కోర్సు కూడా బోధిస్తున్నట్లు తెలిపారు. టెన్త్ పరీక్షలు రాసిన రాసిన విద్యార్థులు తమ పేర్లను కళాశాలలో నమోదు చేసుకోవాలని అన్నారు.

పట్టువస్త్రాల అందజేత

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వవిజ్ఞాన్ స్కూల్‌లో గురువారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సింగం శెట్టి విశ్వనాథ్ సామూహిక ఉచిత వివాహాలు చేసుకునే వారికి పట్టువస్త్రాలను అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని నాగసముద్రం గ్రామంలో ఈనెల 13వతేదీ నరసింహస్వామి ఆలయంలో సామూహిక ఉచిత వివాహాలను నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా 12 జంటలకు పట్టువస్త్రాలు,తలంబ్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు వాసం రవిబాబు, గుర్రంసూర్యనారాయణ, విజయలక్ష్మి, పద్మావతి, ఆలయ అర్చకుడు పెద్ద కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలంటూ ఆందోళన

గుంతకల్లు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఐఓసీ సంస్థ పంచాయతీకి ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ నక్కనదొడ్డి సర్పంచు, గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని ఐఓసీ ఇంధన డిపో వద్దకు గురువారం ఉదయం సర్పంచు వరలక్ష్మి, గ్రామస్థులు చేరుకుని ఆ సంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సర్పంచు మాట్లాడుతూ ఐఓసీ డిపో నిర్మాణానికి తమ పంచాయతీలోని రైతుల నుంచి వ్యవసాయ భూములను తీసుకున్నారని, ఆ సమయంలో పంచాయతీ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషిచేస్తామంటూ సంస్థ యాజమాన్యం అప్పటి కలెక్టర్ సమక్షంలో హామీ ఇచ్చిందని తెలిపారు. ఇప్పుడు వాటిని అమలుపరచడం లేదన్నారు. ఐఓసీలో కాంట్రాక్టు ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వకుండా బయటివారికి ఇచ్చారని, వెయ్యి మంది మహిళలకు కుట్టు మిష న్లు ఇస్తామని ప్రకటించి విస్మరించారని వాపోయారు. అనంతరం ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ఐఓసీ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. టీడీపీ నాయకుడు బొజ్జేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందిస్తున్నాం

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్య అందిస్తున్నామని పట్టణంలోని శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ కేసీ హరికుమార్, ఛైర్మన్ డీఏ మురళీకృష్ణ పేర్కొన్నారు. కళాశాలలోని సెమినార్ హల్‌లో గురువారం వారు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచేత విద్యను అందిస్తుండడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఎదుగుదలలో అధ్యాపకులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని చెప్పారు. కళాశాల డైరెక్టర్ గోపాల్, కోశాధికారి అశ్వర్థమ్మ, వైస్‌ప్రిన్సిపాల్ సురేష్ పాల్గొన్నారు.

ఐదోరోజూ శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె


గ్రాసం తింటూ నిరసన తెలుపుతున్న కార్మికులు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేతనాలు ఇవ్వాలని కోరుతూ పట్టణంలోని శ్రీరామి రెడ్డి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె గురువారానికి ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు స్థానిక తాగునీటి పంపుహౌస్ వద్ద గ్రాసం తింటూ వినూత్న నిరసన తెలిపారు. సమ్మెకు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మద్దతు పలికి మాట్లాడారు. బకాయి వేతనాలు, పీఎఫ్ ఇవ్వాలని ఐదురోజుల నుంచి శ్రీరామిరెడ్డి కార్మికులు ఆందోళన చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారుల్లో ఏమాత్రం చలనం లేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి రంగనాథ్, ఎస్ఎఫ్ఐ నాయకులు భవిత్, శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ కోశాధికారి వన్నూరుస్వామి, తాలుకా అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం: కాలవ

ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ


కాలవకు సమస్యలు వివరిస్తున్న అర్జీదారులు

రాయదుర్గం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అర్జీదారులు వినతుల ద్వారా తెలిపిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ జరిగింది. రాయదుర్గం రూరల్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి అనేక మంది ప్రజలు తరలివచ్చి పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు. కాలవ వాటిని స్వీకరించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి సోమవారం అన్ని శాఖల అధికారులతో ఫిర్యాదుల దినోత్సవం నిర్వహిస్తుండగా.. ప్రజాప్రతినిధులు కూడా వారానికి ఒకసారి ప్రత్యేకంగా ఫిర్యాదుదారుల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిం చే కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు రూపొందించారన్నారు. అర్జీలన్నింటినీ పరిశీలించి అర్హత ఉన్న ప్రతి సమస్యను తప్పక పరిష్కరిస్తామని తెలిపారు. సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఒక వేళ ఆలస్యమైతే ఎందు వల్ల ఆలస్యం అవుతోందో సంబంధిత అర్జీదారుడికి వివరణ ఇవ్వాలని తెలిపారు. 2029 నాటికి అర్హులైన పేదలందరికీ సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పమని, పట్టణ పరిధిలో 2.5 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలంలో సౌకర్యవంతంగా ఇంటి నిర్మాణాలు చేపడతామని ఈ సందర్భంగా తెలిపారు. ఖాళీ స్థలం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత కింద, స్థలం లేని వారికి స్థలంతో పాటు పక్కా ఇంటి నిర్మాణాన్ని రెండో ప్రాధాన్యత కింద చేపడతామని చెప్పారు. పేదలకు న్యాయం చేయటానికి ప్రభుత్వం అనునిత్యం పని చేస్తుందని పేర్కొన్నారు. పలువురు టీడీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో విధులు నిర్వర్తించండి

రాయదుర్గం: సమాజసేవ కంటే మించింది మరొకటి లేదని ప్రభుత్వ ఉపాధ్యాయులకు విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పాఠశాల విద్యావ్యవస్థ పునర్నిర్మాణంపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులపై సామాజిక బాధ్యత ఎంతో ఉందన్నారు. ఉపాధ్యాయుల చేతుల్లోనే రేపటి పౌరుల భవిష్యత్తు ఆధారపడిందన్నారు. సమజాభివృద్ధికి ఉపయోగపడే అత్యుత్తమ వ్యక్తులుగా వారిని తీర్చిదిద్దాలన్నారు. మానవ సేవే పరమావధిగా భావించి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఈ ప్రాంతాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశారని, అలాంటి గొప్పవ్యక్తుల జీవితాలను ఆదర్శగా తీసుకుని సమాజాభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

గ్రానైట్ ఫ్యాక్టరీలను ఆదుకోండి

● మైనింగ్ మంత్రి కొల్లు రవీంద్రను కోరిన యజమానులు


మంత్రికి జ్ఞాపికను అందిస్తున్న గ్రానైట్ పరిశ్రమల యజమానులు

తాడిపత్రి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గ్రానైట్, నల్లబండల పరిశ్రమలను ఆదుకోవాలని పట్టణానికి చెందిన వాటి యజమానులు ఎక్సైజ్, మైనింగ్‌శాఖల మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. జిల్లాకేంద్రానికి గురువారం వచ్చిన మంత్రిని వారు ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కలిసి పలు సమస్యలను వివరించారు. గతంలో రాయల్టీ, విద్యుత్‌బిల్లులు తక్కువగా ఉండడంతో తాడిపత్రి పట్టణంలో దాదాపు 650గ్రానైట్ పరిశ్రమలు, దాదాపు 1300 నల్లబండల పరిశ్రమలు ఉండేవన్నారు. గతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 30వేల నుంచి 40వేల మంది కార్మికులు ఉపాధి పొందేవారన్నారు. ప్రస్తుతం పన్నులు, విద్యుత్ బిల్లులు, రాయల్టీలు, జీఎస్టీ పెరిగిపోవడంతో నిర్వహణ కష్టమై చాలావరకు మూతపడ్డాయన్నారు. వాటిని తగ్గించినట్లయితే పరిశ్రమల మనుగడ సాధ్యమవుతుందన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటికే ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి పలుమార్లు వీటి పైన తనతో మాట్లాడారని, తాను మీ ఊరికి వచ్చి ఫ్యాక్టరీలను పరిశీలించి సీఎం చంద్రబాబుతో చర్చించి న్యాయం జరిగేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో ఎస్వీ రవీంద్రారెడ్డి, శివారెడ్డి, దబ్బర బాబు, రఘునాథరెడ్డి, గోపాల్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి: ఎంఎన్‌యూ


తాడిపత్రి ఆర్టీసీ డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

తాడిపత్రి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం ధర్నా నిర్వహించారు. ఎన్ఎంయూ రీజనల్ సెక్రెటరీ ప్రతాప్‌నారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీచేసిన 1/2019 సర్క్యులర్‌ను కిందిస్థాయి సిబ్బంది అమలుచేయాలని అన్నారు. అలాగే ఆర్టీసీలో ఉన్న పాత వైద్య విధానాన్ని ప్రవేశపెట్టాలని, గ్యారేజీ ఉద్యోగులకు సరైన పనిముట్లు అందజేయాలని, రిటైర్డ్ ఉద్యోగులను సూపర్‌లగ్జరీ బస్సుల్లో ప్రయాణించేందు కు అనుమతించాలని, ఆన్‌కాల్ డ్రైవర్లకు నెలవారీ జీతాలు ఇవ్వాలని, అక్రమ సస్పెన్షన్లు ఆపాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ధర్నాలో డిపో ఛైర్మన్ మహేష్, కేజీఎన్ బాబు, సుధాకర్, రామకృష్ణ, గౌస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూరు యూనియన్ నాయకులు నిరసన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎంఆర్ గోపాల్, కార్యదర్శి ఎన్‌వీ రాముడు, నాయకులు పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపో గేటు వద్ద ఎన్ఎంయూ నాయకులు, ఆర్టీసీ కార్మికులు గేట్‌మీటింగ్ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రెటరీ నాగరాజు, జోనల్ ఉపాధ్యక్షుడు ఎంఎండీ షఫీ, డిపో కార్యదర్శి హెచ్ తిప్పేస్వామి, రీజనల్ ప్రెసిడెంట్ దామోదర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవి నాయక్, డిపో ప్రెసిడెంట్ జిలాన్, గ్యారేజ్ అధ్యక్ష,కార్యదర్శులు దూద్‌పీరా, సతీష్‌కుమార్, ట్రెజరర్ యోగేంద్ర, పబ్లిసిటీ సెక్రెటరీ నఫీస్, డిపో నాయకుడు తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బొమ్మనహాళ్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉపాధి హామీ పీడీ సలీంబాషా, అసిస్టెంట్ పీడీ నాగేశ్వరరావు, ఎంపీడీఓ విజయభాస్కర్ గురువారం పరిశీలించారు. ఉపాధి పథకం కింద లింగదహాళ్, కొళగానహళ్లి, నేమకల్లు గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్లు, గోకులంషెడ్లు, పశువుల తొ ట్టెల నిర్మాణంతో పాటు పండ్ల మొక్కల పెంపకాన్ని పరిశీలించారు పనుల్లో వేగవంతంగా నా ణ్యతగా జరగాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, నీటికుంటలు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. పీఆర్ జేఈ జగదీష్, ఏపీఓ భాగ్యలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు బ్రహ్మయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

యాడికి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పరిమి చరణ్‌కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న గురువారం తెలిపారు. గత మార్చి 19వ తేదీ న పచ్చారుమేకలపల్లి గ్రామంలో రస్తా విషయంలో పరిమి చరణ్‌కుమార్ తన తల్లిని దుర్భాషలాడాడని, పోలీస్‌స్టేషన్ వద్దనున్న తనను కులంపేరుతో దూషించాడని ఆ గ్రామానికి చెందిన ఆదినారాయణ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడని, ఆ ఫిర్యాదు మేరకు పరిమి చరణ్‌కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ఎన్‌సీసీ కేడెట్లకు అభినందనలు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన నలుగురు ఎన్‌సీసీ కేడెట్లు ఇటీవల బ్రాహ్మణపల్లిలో జరిగిన ఫైరింగ్ పోటీలలో అర్హత సాధించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. వీరు కర్నూలు బెటాలియన్‌లో శిక్షణ తీసుకొని, రెండవ దశ ఫైరింగ్‌లో పాల్గొనున్నట్లు చెప్పారు. ఈ కేడెట్లను గురువారం కళాశాలలో అందరూ అభినందించారు.

మంత్రికి కేశవ్‌కు కృతజ్ఞతలు

ఉరవకొండ,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ.40లక్షల విలువ గల ప్రయోగ పరికరాలు మంజూరు అయ్యాయి. ఇందుకు గాను కళాశాల ప్రిన్సిపాల్ అస్రఫ్అలీ, అధ్యాపకులు మంత్రిని జిల్లాకేంద్రంలో గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తర్వాత పూలమాల, శాలువాతో సత్కరించారు. పెనుగొండ సమీపంలోనున్న కియ కంపెనీ ఈ పరికరాలు, యంత్రాలను సమకూర్చనుంది.

సీఎం ఆదేశాలు అమలు కావడం లేదు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్


సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్

గుంతకల్లు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఇస్తున్న ఆదేశాలు అమలు కావడంలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీ.జగదీశ్ విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బెల్టు షాపులు ఉండరాదని, మద్యం ధరలు పెంచరాదని, నిర్ణీత వేళల్లోనే మద్యం షాపులను తెరిచి ఉంచాలని సీఎం ఆదేశాలిస్తున్నా.. క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదన్నారు. ఎమ్మార్పీకి మించి మద్యాన్ని అమ్ముతున్నా ఎక్సైజ్ అధికారులు కమీషన్లకు ఆశపడి పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ప్రతి మద్యం దుకాణం బార్‌ను తలపిస్తోందన్నారు. బెల్టు షాపుల్లో మద్యం ఏరులై పారుతోందన్నారు. తాడిపత్రి, గుంతకల్లు పట్టణాల్లో మద్యం ధరలను పెంచి విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఇతర శాఖల్లో కూడా ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో ప్రజా సమస్యలు వేగవంతంగా పరిష్కారమవుతునాన యని, ఇతర నియోజకవర్గాల్లో అలా ఎందుకు లేదని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, రాయల్ రాము తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

గుత్తి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంఈఓ రవినాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు వినోద్‌కుమార్, తన్వీర్, మనోజ్, షబీర్, తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన అనాథ వృద్ధుడికి ఆ నలుగురు సేవా సమితి వారు గురువారం అంత్యక్రియలను నిర్వహించారు. వృద్ధుడు మృతదేహాన్ని టూటౌన్ పోలీసులు ఆనలుగురు సేవా సమితికి అందజేశారు. సమితి సభ్యులు పాతగుంతకల్లులోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్, సభ్యులు ప్రదీప్‌ఆచారి, భాగ్యరాజ్, వంశీ, రవీంద్ర, స్నేహ, వేణు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నిర్మాణానికి భూమిపూజ

కుందుర్పి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానపల్లి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను సర్పంచ్ నాగేంద్ర, టీడీపీ నాయకులు గురువారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రూ.40 వ్యయంతో గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. మాజీ సర్పంచ్‌లు చిత్రలింగప్ప, రాఘవేంద్రబాబు, గ్రామ కన్వీనర్ తిప్పేస్వామి, వార్డు మెంబ ర్లు పాల్గొన్నారు.

రథోత్సవానికి కాలవకు ఆహ్వానం

కణేకల్లు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 13వ తేదీన జరిగే చిక్కణ్ణేశ్వరస్వామి రథోత్సవానికి హాజరు కావాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. రాయదుర్గం పట్టణంలో గురువారం వారు విప్‌ను కలిసి ఆహ్వానం పలికారు. నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప ఆలయ ధర్మకర్త ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

కంబదూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని కోటవీధిలో గురువారం పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. భాగ్యమ్మ, శంకరమ్మ, అక్బర్, రాజు, తనుశ్రీలపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. వారందరూ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మధ్యకాలంలో మండలకేంద్రంలో పిచ్చికుక్కల దా డులు అధికం కావడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

ఘనంగా సర్వే దినోత్సవం

పెద్దవడుగూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యో తి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జాతీయ సర్వే దినోత్సవాన్ని తహసీల్దార్ ఉషారాణి సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఏప్రిల్ 10, 1802న మేజర్ విలియం లాంబ్టన్ జీటీఎస్ ను ప్రారంభించారని, ఇది భారతదేశంలో ఆ ధునిక సర్వేయింగ్, మ్యాపింగ్‌కు పునాది వేసిన కీలకమైన సంస్థ అని తెలిపారు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామ సర్వేయర్‌కు టోపీ, ఓఆర్ఎస్ ప్యాకెట్ ఇచ్చినట్లు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ జ యమ్మ, మండల సర్వేయర్ ప్రసాద్, గ్రా మ రెవెన్యూ అధికారి, సర్వేయర్లు పాల్గొన్నారు.

శెట్టూరు: సర్వే దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి కేక్ కట్ చేశారు. అనంతరం మండల సర్వే బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. తర్వాత ప్రభుత్వం అందజేసిన టోపీలను సర్వేయర్లకు పంపిణీ చేశారు. డీటీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐ గోవిందరెడ్డి, మండల సర్వేయర్ మున్వర్ బాషా, వీఆర్వోలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

యాడికి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ తాడిపత్రి సీడీపీఓ సాజిదాబేగం గురువారం పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

గాలివానకు నేలకొరిగిన మొక్కజొన్న


కాశీపురంలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి గాలివానకు చేతికొచ్చిన మొక్కజొన్న పంట నేలకూలింది. కాశీపురం, కొండాపురం, నాగిరెడ్డిపల్లి, ఆవులదట్ల, వడ్రవన్నూరు, రాయంపల్లి, బీఎన్‌హళ్లి తదితర గ్రామాల్లో రైతులు హనుమంతు, రామాంజనేయులు, గురుమూర్తి, సోమశేఖర్, మనోహర్‌నాయుడు తదితరులు తమపొలాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటంతా నేలమట్టమైంది. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ. 30 వేల వరకు పెట్టుబడులు పెట్టి సాగు చేశామని, చేతికొచ్చిన పంట నేలకూలిందని, దీంతో తీవ్ర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు. ఆవులదట్లలో తిప్పేస్వామి నాయక్ చెందిన మామిడితోటలో కాయలన్నీ రాలిపోయాయి. అధికారులు స్పందించి తమకు ఆదుకోవాలని ఆయా రైతులు కోరారు.

బొప్పాయి చెట్లు నేలమట్టం


బాలవెంకటాపురంలో నేలకొరిగిన బొప్పాయి చెట్లు

కళ్యాణదుర్గం: మండలంలోని బాల వెంకటాపురం గ్రామంలో గురువారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులకు, వర్షానికి బొప్పాయి చెట్లన్నీ నేలకొరిగాయి. గ్రామానికి చెందిన దాసరి అంతేష్ తనకున్న నాలుగు ఎకరాల పొలంలో బొప్పాయి సాగుచేశాడు. పంట ఎదుగుదల వచ్చే సమయంలో అకాల వర్షం, ఈదురుగాలులకు చెట్లన్నీ నేలకొరిగాయి. సుమారు 4600 చెట్లు నేలకొరిగినట్లు బాధిత రైతు తెలిపారు. లక్షలాదిరూపాయల నష్టం వాటిల్లిందన్నాడు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రైతుకు ఫోన్ చేసి అధైర్యపడవద్దు అండగా వుంటామని అభయమిచ్చారు. శుక్రవారం హార్టికల్చర్, వ్యవసాయాధికారులు పొలాన్ని సందర్శించి జరిగిన నష్టాన్ని అంచనా వేస్తారని, నష్టపరిహారం అందేవిధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

48 హెక్టార్లలో పంట నష్టం

కణేకల్లు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి, కణేకల్లు క్రాసింగ్, పుల్లంపల్లి తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు 48హెక్టార్లలో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. పంటనష్టం జరిగిన పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 62 మంది రైతుల పొలాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని అన్నారు. పంట నష్టపోయిన రైతులు ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, పట్టాదారు పాసుపుస్తకాలను రైతుసేవా కేంద్రాల్లో అందించాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్రగాయాలు

యాడికి, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. చిక్కేపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు లక్ష్మిదేవి కేశవరాయునిపేట గ్రామానికి బంధువుల వివాహ నిమిత్తం వెళ్లింది. అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్లడానికి రాయలచెరువులో బస్సు ఎక్కడానికి రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. భుజం నుంచి చేయి వేరయింది. స్థానికు లు వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించా రు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

జక్కలచెరువు వద్ద యువకుడికి...

గుత్తిరూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గుత్తి పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన విజయ్ బైక్‌లో గుత్తి నుంచి తాడిపత్రికి బయలుదేరారు. జక్కలచెరువు గ్రామశివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో ఓబుళదేవర జాతర

బెళుగుప్ప, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడిలో రెండురోజుల పాటు ఓబుళదేవర జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక లక్ష్మీ నరసింహస్వామి, అక్కమాంబ దేవతలకు గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం చాపిరిలోని ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను గ్రామానికి తీసుకువచ్చి గురువారం వరకు ఊరేగించారు. దీంతో జాతర ముగిసింది. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రెండో సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రభుత్వ ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రెండో సెమిస్టర్ పరీక్షలకు ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ లక్ష్మయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు ఫీజు చెల్లించాలని, పరీక్షలు మే 5వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని అన్నారు. కళాశాలలో లేదా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫీజు చెల్లించవచ్చునని సూచించారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

యాడికి, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ మండలవ్యాప్తంగా ఉన్న ముస్లింలు గురువారం మండలకేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుతో ముస్లింలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లు తప్పుదారి పట్టించేదిగా ఉందని అన్నారు. వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తాడిపత్రిలో చేపట్టిన నిరసన శిబిరం వద్దకు బైకలలో ర్యాలీగా వెళ్లారు. ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల మృతికి నివాళి


శివకుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటశివుడు యాదవ్

పామిడి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి శివకుమార్ (50) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, పార్టీ ద్వారా వచ్చే సాయాన్ని అందజేస్తామని భరోసానిచ్చారు. అలాగే తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

● కుందుర్పి: మండలంలోని కొలిమిపాళ్యం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రామప్ప (70) గురువారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ మండల నాయకులు గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.